# ప్రజాతపన

prajathapana.com

News that matters




సుఖమయం, శుభదాయకం, అయిన లోకం సామాజిక ప్రగతి, వేడి మంచు, నల్లని వెలుగుల్లా అసంబద్ధమైనవే. అనర్థాలను సృష్టించని భౌతిక అభివృద్ధి ఉండదు.


- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 35 శుక్రవారం 17 మార్చి 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


# రూ 2, 79, 279.27 కోట్ల రూపాయల ఏపీ వార్షిక బడ్జెట్

## పేద, బలహీన వర్గాలకు ప్రాధాన్యత-మంత్రి బుగ్గన

**ప్రజాతపన ,అమరావతి**



గురువారం ఉదయం అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వార్షిక బడ్జెట్ లో వ్యవసాయం, వైద్య, ఆరోగ్య, పంచాయితీ రాజ్ , గ్రామీణాభివృద్ధి రంగాలకు భారీగా నిధులు కేటాయించారు. బడ్జెట్ సమావేశానికి ముందుగా శాసనసభలో మాజీ మంత్రి వట్టి వసంత కుమార్ , కుతూహలమ్మ, పాతపాటి సర్రాజుతో పాటు మరో ముగ్గురు సభ్యుల మృతి పట్ల సభ సంతాపం తెలిపింది.

అంతకుముందు సచివాలయంలోని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బడ్జెట్ ప్రతులు స్వామి చిత్రపటం వద్ద ఉంచి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ పూజ నిర్వహించారు. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్ రావత్, ఆర్థిక శాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, ఆర్థిక శాఖ కార్యదర్శి. ఎన్ గుల్జార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, సీఎఫ్ఎంఎస్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మొత్తం రెండు లక్షల 79 వేల 279.27 కోట్ల రూపాయలతో వార్షిక బడ్జెట్ను మంత్రి సభ ముందు ఉంచారు. ముందుగా పోతన పద్యంతో బడ్జెట్ ప్రసంగాన్ని మంత్రి మొదలుపెట్టారు

మంత్రి మాట్లాడుతూ పేద ప్రజలు, బలహీన వర్గాలకు బడ్జెట్లో ప్రాధాన్యత ఇస్తున్నట్టు వెల్లడించారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. బడ్జెట్ కేటాయింపులు : రెవిన్యూ వ్యయం రూ. 2,28,540 కోట్లు, మూల ధన వ్యయం రూ.31,061 కోట్లు, రెవిన్యూ లోటు రూ.22,316 కోట్లు, ద్రవ్య లోటు రూ.54,587 కోట్లు, జీఎస్డిపి లో రెవిన్యూ లోటు 3.77 శాతం. వైఎస్ఆర్ పెన్షన్ కానుక రూ.21,434.72 కోట్లు. వైఎస్ఆర్ రైతు భరోసా రూ.4,020 కోట్లు. జగనన్న విద్యా దీవెన రూ.2,841.64 కోట్లు, జగనన్న వసతి దీవెన రూ.2,200 కోట్లు, వైఎస్ఆర్ – పీఎం బీమా యోజన రూ.1600 కోట్లు, డ్వాక్రా సంఘాలకు వడ్డీలేని రుణాల కోసం రూ.1000 కోట్లు, రైతులకు వడ్డీలేని రుణాలు రూ.500 కోట్లు, వైఎస్ఆర్ కాపు నేస్తం రూ.550 కోట్లు, జగనన్న చేదోడు రూ.350 కోట్లు, వైఎస్ఆర్ వాహన మిత్ర రూ.275 కోట్లు, వైఎస్ఆర్ నేతన్న

(మిగతా 2లో)



# మోడీకి నోబెల్ శాంతి బహుమతి..?

**ప్రజాతపన ,న్యూఢిల్లీ:**

రష్యా- ఉక్రెయిన్ యుద్ధ నేపథ్యంలో భారత్ ప్రధాని నరేంద్ర మోదీ ఆ రెండు దేశాల మధ్య మధ్యవర్తిత్వం వహించిన విధానాన్ని నోబెల్ శాంతి బహుమతి కమిటీ సభ్యుడు అస్లే టోజె ప్రసంశించారు. శాంతిని, స్నేహాన్ని కోరుకోవడంతో ఆయన ఎప్పుడూ ముందుంటారంటూ మోదీని ప్రశంసల్లో ముంచెత్తారు. దేశం మాట్లాడితే ప్రపంచం వింటుందని భారతదేశ గొప్పదనాన్ని ప్రశంసిచారు. భారత్ పర్యటనలో ఉన్న అస్లే టోజే బుధవారం మీడియా సమావేశంలో ఈ విధంగా మాట్లాడారు..‘ఉక్రెయిన్ సంక్షోభం నేపథ్యంలో రష్యా అణ్వాయుధాలు ప్రయోగించకుండా ప్రధాని మోదీ సానుకూల వ్యవహరించారు. భారత్ వంటి శక్తివంతమైన దేశం నుంచి ఈ విధమైన సందేశం రావడం నాకు చాలా ఆనందంగా ఉంది. ప్రపంచంలోని అన్ని దేశాలు ఈ సందేశం ఇవ్వాలనుకుంటున్నాను. మోదీ కొన్నేళ్లుగా ప్రధాన మంత్రి పదవిలో కొనసాగుతున్నారు. ప్రపంచంలోని

(మిగతా 2లో)

# 7 నుంచి రామాయణ్ యాత్ర భారత్ గౌరవ ట్రైన్

**ప్రజాతపన ,ముంబై:**

ఢిల్లీ నుంచి శ్రీ రామాయణ యాత్ర కోసం బయల్దేరే భారత్ గౌరవ్ ట్రైన్ ఏప్రిల్ 7 న ఢిల్లీ నుంచి ప్రారంభమవుతుంది. శ్రీరాముడు, రామాయణంతో సంబంధమున్న వివిధ పుణ్య క్షేత్రాలను 18 రోజుల పాటు చూపుతుంది. భారత్ గౌరవ్ ట్రైన్ ప్రత్యేకంగా టూరిజం అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన రైలు. ఇది ఏసీ డీలక్స్ టూరిస్ట్ ట్రైన్. ఇందులో ప్రయాణికుల కోసం అత్యాధునిక సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు మొత్తం 26 భారత్

(మిగతా 2లో)







# చాట్ జీపీటీ 4

**ప్రజాతపన , న్యూఢిల్లీ:**

ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఏఐ చాట్‌బోట్ చాట్ జీపీటీకి అప్‌డేటెడ్ వెర్షన్ వచ్చేసింది. మరింత శక్తిమంత మైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్ జీపీటీ-4ను ఓపెన్ ఏఐ రిలీజ్ చేసింది. ప్రస్తుత చాట్‌జీపీటీ-3.5 కన్నా ఇది మరింత వేగంగా, కచ్చితత్వంతో సమాధానాలు చెబుతుందని ఓపెన్ ఏఐ పేర్కొంది. దాదాపు మనిషి లాంటి టెక్నాలజీ ఉంటుందని వెల్లడించింది. ఈ కొత్త వెర్షన్ మరింత సురక్షితంగా ఉంటుందని పేర్కొంది. ప్రస్తుతం ఓపెన్ ఏఐ ప్లాన్ చాట్‌జీపీటీ ప్లస్ సబ్‌స్క్రైబర్లకు ఈ జీపీటీ-4 అందుబాటులో ఉంది. నవంబర్‌లో చాట్‌జీపీటీ వచ్చి పాపులర్ అయినప్పటి నుంచి చాలా మంది జీపీటీ-4 ఎప్పుడెప్పుడు వస్తుందా అని వేచిచూస్తున్నారు. ప్రస్తుతం ఉన్న లార్జ్ లాంగ్వేజ్ మోడల్ కంటే ఈ జీపీటీ-4 టెక్నాలజీ అత్యుత్తమంగా ఉండనుండటంతో చాలా

(మిగతా 2లో)

# వచ్చే జనవరి నుంచి పెన్షన్ రూ. 3వేలు

## ఏపీ అసెంబ్లీ వేదికగా సీఎం వైఎస్ జగన్ కీలక ప్రకటన

**ప్రజాతపన ,అమరావతి**



వచ్చే జనవరి నుంచి రూ. 3వేలకు పెన్షన్ పెంచుతామని కీలక ప్రకటన చేశారు. పెంపు తర్వాతే ఎన్నికలకు వెళ్తానని జగన్ తేల్చిచెప్పారు. గవర్నర్ ప్రసంగంకు సమాధానం ఇస్తూ అసెంబ్లీలో సీఎం జగన్ ప్రసంగించారు. ఈ సందర్భంగా వైసీపీ అధికారంలోకి వచ్చినప్పట్నుంచీ ఏం చేసింది..? ఏం చేయబోతోంది..? అనే విషయాలను నిశితంగా వివరించారు. గత ప్రభుత్వంలో 39 లక్షల మందికి మాత్రమే.. అది కూడా కేవలం రూ. 1000 పెన్షన్ అందేదని.. తమ హయాంలో 65 లక్షల మందికి రూ. 2750 చొప్పున అందిస్తున్నట్లు అసెంబ్లీ వేదికగా జగన్ చెప్పుకొచ్చారు. ఏపీలో మాదిరిగా పెన్షన్, రేషన్ అందిస్తున్న విధానం ప్రపంచంలోనే ఎక్కడా లేదని సీఎం స్పష్టం చేశారు. అంతేకాదు.. రేషన్ కార్డులు కోటి 46 లక్షలకు పెంచామని.. ప్రజలకు రేషన్ డోర్ డెలివరీ చేస్తున్నామని తెలిపారు.

### మా ప్రభుత్వం చేసింది ఇదీ..!

ఎన్నికల హామీలను మరిచిపోవడం గత ప్రభుత్వానికి అలవాటేనని విమర్శలు గుప్పించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 80 శాతం నెరవేర్చామని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన 45 నెలల్లో 98 శాతం హామీలు పూర్తి చేసిన ప్రభుత్వం వైసీపీ అని అసెంబ్లీలో ఆయన చెప్పుకొచ్చారు. 45 పాలనలో మార్పు వచ్చిందని.. జగన్ మార్క్ స్పష్టంగా కనిపిస్తోందన్నారు. మానిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి దానిని అమలు చేయటంలో ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ‘రాజకీయాల్లో విశ్వసనీయతను పెంచి గొప్ప మార్పును తీసుకువచ్చాం. కులమత రాజకీయాలు , వర్గాలు చూడ కుండా సంక్షేమ పథకాలు అందించాం. నాలుగో ఏడాది వరుసగా బడ్జెట్ ప్రవేశపెడుతున్నాం. అందరూ నా వాళ్లే అన్న నిర్ణయంతో పాలన అందిస్తున్నాం. ఎప్పటికప్పుడు అభివృద్ధి పథంలోకి వెళ్లేలా పాలన జరుగుతోంది. 1.97 లక్షల కోట్లు డీబీటీ ద్వారా లబ్దిదారుల ఖాతాల్లోకి నేరుగా బటన్ నొక్కి బదిలీ చేశాం. గతంలో బడ్జెట్‌లు ఎవరికీ అర్థం కాని రీతిలో ఉండేవి, ప్రజలకు ఏం మేలు జరిగిందన్న సమాధానం దొరికేది కాదు. ఇప్పుడు ఇంటింటికీ, మనిషి మనిషికి, గడపగడపకూ వివరాలు అందించగలుగుతున్నాం. పాలన వికంద్రీకరించి 26 జిల్లాలు చేశాం, పౌరసేవలూ సులభంగా

(మిగతా 2లో)

# విచారణకు నేను రాలేను...



**న ప్రజాతపన ,న్యూఢిల్లీ:**

ఢిల్లీలోనే ఉన్న ఎమ్మెల్సీ కవిత ఈడీ ముందు హాజరవుతుంది అనే చివరి నిమిషంలో అందరూ షాక్ అయ్యేలా ఈడీకి కవిత లేఖ రాసింది. నేను రాను రాలేనంటూ ఈడీకి లేఖ రాసారు ఎమ్మెల్సీ కవిత. మార్చి 16వ తేదీ విచారణకు హాజరు కాలేదు. అనారోగ్య కారణాలతో హాజరు కాలేక పోతున్నానని.. మీరు అడిగిన ప్రశ్నలకు

(మిగతా 2లో)

ప్రజా తపన
prajathapana.com
News that matters

# ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతోత్సవం

**ప్రజా తపన. నెల్లూరు.**



భాషా ప్రయుక్త రాష్ట్రాల పితామహుడు, ఆంధ్ర రాష్ట్ర అవతరణ కొరకు అమరణ నిరాహారదీక్ష చేసి అసువులు బాసిన మహానీయులు పొట్టి శ్రీరాములు అని 'ప్రాచీ గాన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం' సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ ఉద్ఘాటించారు. పొట్టి శ్రీరాములు 122 వ జయంతిని పురస్కరించుకుని అధ్యయన కేంద్రంలో జయంతోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ మాట్లాడుతూ...సత్యం, అహింస, హరిజనోద్ధరణకు తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మనీషి శ్రీరాములు గారు. ఈయన తన చిన్నతనం నుంచి దేశభక్తిని పుణికి పుచ్చుకుని దాని కోసం త్రికరణశుద్ధిగా పనిచేశారు. అంతేకాదు గాంధీజీ గారి సిద్ధాంతాలను తు.చ తప్పకుండా పాటించి తన కంటూ ఓ ప్రత్యేకతను చాటుకున్నారు. స్వాతంత్ర్యోద్యమానికి, హరిజనోద్ధరణకు, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు వీరు చేసిన కృషి ఎంతో ఆదర్శనీయమైంది. తెలుగు వారి కోసం, తెలుగు భాష కోసం తన ప్రాణాలను అర్పించిన ఆ త్యాగమూర్తిని తెలుగు జాతిపితగా వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కేంద్ర విద్యాత్మక, కార్యనిర్వహణ సిబ్బంది పాల్గొని పొట్టి శ్రీరాములు వారి చిత్రపటానికి పూల మాలలు వేసి జోహార్లు పలికారు.

# రూ 2, 79, 279.27 కోట్ల రూపాయల ఏపీ వార్షిక బడ్జెట్

(మొదటిపేజీ తరువాయి)

నేస్తం రూ.200 కోట్లు, వైఎస్ఆర్ మత్స్యకార భరోసా రూ.125 కోట్లు, మత్స్యకారుల డీజిల్ సబ్సిడీ కోసం రూ.50 కోట్లు, రైతుల కుటుంబాలకు పరిహారం కోసం రూ.20 కోట్లు. జగనన్న తోడు రూ.35 కోట్లు, ఈబీసీ నేస్తం రూ.610 కోట్లు.

వ్యవసాయ బడ్జెట్ 41 వేల కోట్లు

బడ్జెట్‌లో భాగంగా వ్యవసాయ పద్దును ప్రకటించారు. ఆ పద్దును ఏ ఏ విధలుగా ఖర్చు పెడతారో వ్యవసాయ పద్దు ద్వారా కాకాణి గోవర్ధన్ రెడ్డి వివరించారు. రైతు భరోసా పథకం కింద ఇప్పటివరకూ రూ.6940 కోట్లు అందించినట్లు మంత్రి కాకాణి తెలిపారు. రైతులకు యూనివర్సల్ బీమా కల్పించిన ఏకైక రాష్ట్రం మనదేనన్నారు. ఏపీ సీడ్స్ కు జాతీయ స్థాయిలో అవార్డులు వస్తున్నాయన్నారు. విత్తనాల రాయితీకి రూ.200 కోట్లు కేటాయించామని, ఆర్బీకేల ద్వారా రూ.450 కోట్ల ఎరువుల సరఫరా చేస్తున్నామన్నారు. ఆర్బీకేల్లో 50 వేల టన్నుల ఎరువుల్ని నిల్వ చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.01 లక్షల కోట్ల రైతు రుణాలిచ్చామని, దీంతో 9 లక్షల మందికి మేలు జరిగిందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ సలహా మండళ్లు ఏర్పాటు చేశామని, 3.5 లక్షల మంది సన్నకారు రైతులకు సబ్సిడీపై స్ప్రేయర్లు అందించామని కాకాణి పేర్కొన్నారు. డ్రోన్లతో పురుగుమందులు పిచికారీ చేయిస్తున్నామన్నారు. ఆర్బీకేల ద్వారా రైతులకు 10వేల డ్రోన్లు అందిస్తున్నామన్నారు. చిరు ధాన్యాల సమగ్ర సాగు విధానం తీసుకొచ్చి, హెక్టార్ కు 6 వేలు ప్రోత్సాహకం ఇస్తున్నామన్నారు. పట్టు పరిశ్రమ ప్రగతి పథంలో నిలిపామని, ధరల స్థిరీకరణ నిధితో రైతుల్ని ఆదుకుంటున్నామని కాకాణి తెలిపారు వ్యవసాయ బడ్జెట్ లో రైతు భరోసా కేంద్రాల వద్ద బ్యాంకింగ్ సదుపాయాలు కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైతులకు కావాల్సిన అన్ని సేవల్ని గ్రామాల్లోనే అందిస్తున్నామని, వారి ఆదాయం పెంచేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఆర్బీకేలను మరింత పటిష్టంచేసేలా అన్ని ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. వీటిని మరింతగా రైతుల్లోకి తీసుకెళ్లేందుకు యూట్యూబ్ ఛానళ్లు, మాసపత్రికలు ప్రారంభించినట్లు కాకాణి వెల్లడించారు. అంతకు ముందు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి 2 లక్షల 79 వేల కోట్లతో ఏపీ బడ్జెట్ ప్రవేశ పెట్టారు. రెవెన్యూ లోటు 22,316 కోట్లుగా పేర్కొన్నారు. ప్రగతికి అవసరమైన నాలుగు ప్రధాన అంశాలను ఆధారంగా చేసుకొని 2023-24 సంవత్సరానికి ఏపీ బడ్జెట్ కోసం కేటాయింపులు చేసినట్టు పేర్కొన్నారు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి. సుస్థిర అభివృద్ధి, జవాబుదారీతనం, ప్రతిస్పందన, పారదర్శకత సమాన అవకాశాలతో కూడిన సుపరిపాలనకు దారి తీస్తుందన్నారు బుగ్గన. తమ పార్టీ మేనిఫెస్టోనే ఆ సూత్రాలకు అనుగుణంగా రూపొందించిందని గుర్తు చేశారు. అందుకే స్థిరమైన అభివృద్ధితో దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా ఉందని చెప్పారు. ఏపీ బడ్జెట్ 2023లో పాఠశాల విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఇదుకోసం రూ. 29,690 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. అలాగే ఉన్నత విద్య కోసం రూ. 2,064 కోట్లు కేటాయింపులు జరిపింది.

# మోడీకి నోబెల్ శాంతి బహుమతి..?

(మొదటిపేజీ తరువాయి)

సీనియర్ రాజనీతిజ్ఞుల్లో మోదీ ఒకరు. కోవిడ్ వంటి గడ్డు పరిస్థితులను తట్టుకుని ఆర్థిక సంక్షోభంలో పడనీనకుండా దేశాన్ని కాపాడారు. అన్ని రంగాల్లో దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రపంచదేశాలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ దేశ అభివృద్ధికి దోహదం చేస్తున్నారు. భారత్ ప్రపంచంలోని కీలక ఆర్థిక వ్యవస్థలలో ఎదుగుతోంది. ఏ దేశాన్ని ఒత్తిడి చేయకుండా, ఏ ఒక్కరినీ బెదిరించకుండా తమ స్నేహపూర్వక వైఖరితో సత్సంబంధాలను కొనసాగిస్తోంది. భారత్ శక్తివంతమైన దేశంగా ఎదగడానికి మోదీ అమలు చేస్తున్న విధానాలే ప్రధాన కారణం. ఈ విధమైన వైఖరి అంతర్జాతీయ రాజకీయాలకు అవసరం. భారత్ ఒక సూపర్ పవర్‌గా అవతరించాలి. యుద్ధాలను సైతం ఆపగల సత్తా ఉన్న నాయకుడు మోదీ. ఆయన మాత్రమే శాంతిని నెలకొల్పగలరు. ప్రధాని మోదీకి నోబెల్ శాంతి బహుమతి ఇస్తే చరిత్రలో అదొక అపూర్వ ఘట్టమవుతుందని' అస్లే టోజె వ్యాఖ్యానించారు.కాగా నోబెల్ శాంతి బహుమతి ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన అవార్డులలో ఒకటి. శాంతిని పెంపొందించడానికి గణనీయమైన కృషి చేసిన వారికి ఈ బహుమతితో సత్కరిస్తుంటారు. ఇక నోబెల్ శాంతి బహుమతికి ప్రధాని మోదీ పేరు తెరపైకి రావడం ఇదేం తొలిసారికాదు. గతంలో కూడా చాలాసార్లు ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది అక్టోబర్ లో ప్రకటించే నోబెల్ శాంతి బహుమతికి మోదీ ఎంపికకావచ్చనే అంశం ప్రస్తుతం సర్వత్రా చర్చణీయాంశమైంది.

# వచ్చే జనవరి నుంచి పెన్షన్ రూ. 3వేలు

(మొదటిపేజీ తరువాయి)

అందుతున్నాయి. 76 రెవెన్యూ డివిజన్లు రాష్ట్రంలో ఏర్పాటు చేయగలిగాం. 15004 గ్రామవార్డు సచివాలయాల ద్వారా 600 పౌరసేవలు ప్రజలకు అందించగలుగుతున్నాం' అని జగన్ చెప్పుకొచ్చారు.

## గొప్ప విప్లవం..!

'ప్రభుత్వం అందించే పౌరసేవల్లో ఈ నిర్ణయం గొప్ప విప్లవం. ఏపీలో కొత్తగా వైద్య కళాశాలలు నిర్మిస్తున్నాం. వ్యవసాయ ఉచిత విద్యుత్ కోసం 2.49 రూపాయల యూనిట్ చొప్పున 7 వేల మెగావాట్లు విద్యుత్ అందిస్తున్నాం. విశాఖ సమ్మిట్‌తో పాటు దావోస్‌లో చేసుకున్న ఒప్పందాల మేరకు 13 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. దేశంలోనే అత్యధిక వృద్ధి రేటు సాధించిన రాష్ట్రం ఏపీ ఒక్కటే. సుపరిపాలన కారణంగానే ఇదంతా సాధించగలిగాం. గ్రామం నుంచి రాష్ట్ర రాజధాని వరకూ 45 నెలలో జగన్ మార్కు మార్పు కనిపిస్తుంది' అని జగన్ తెలిపారు.

# విచారణకు నేను రాలేను...

(మొదటిపేజీ తరువాయి)

నా సమాధానం ఇదే అంటూ తన ప్రతినిధితో అధికారులకు లేఖ పంపారు. సుప్రీంకోర్టులో పిటీషన్ పెండింగ్ లో ఉందని.. కోర్టు నిర్ణయం తర్వాత హాజరుఅవుతానని లేఖలో పేర్కొన్నారు కవిత. కవిత రాలేనంటూ లేఖ రాయడంతో ఢిల్లీలో ఏంజరగుతుందో అని ఎదురుచూస్తున్న వారందరికీ మైండ్ బ్లాక్ అయ్యింది. ఒక్కక్షణంలో కవిత ఈడీ ముందు హాజరు అవుతుందని నిర్ణయాలు తారుమారు కావడంతో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

షెడ్యూల్ ప్రకారం అయితే ఉదయం 11 గంటలకే ఈడీ అధికారుల ఎదుట హాజరుకావాల్సి ఉంది. ఈ క్రమంలోనే తన న్యాయవాదులతో సుదీర్ఘంగా ఇంట్లోనే చర్చించారు కవిత. కాగా.. ఈడీ ప్రశ్నలకు సమాధానాలను లేఖ ద్వారా పంపించటం ద్వారా విచారణకు హాజరుకాకూడదనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తుంది. ఎమ్మెల్సీ కవితకు మద్దతుగా ఢిల్లీలో ఐదుగురు బీఆర్ఎస్ పార్టీ మంత్రులు ఉన్నారు ఎప్పటికప్పుడు లాయర్లతో చర్చలు జరుపుతున్నారు. కవిత పంపిన లేఖపై ఈడీ అధికారులు ఏ విధంగా స్పందిస్తారు అనేది చూడాలి. ఇక.. మహిళలను ఈడీ ఆఫీస్‌కు పిలిచి విచారించడంపై కవిత న్యాయపోరాటం చేస్తున్న విషయం తెలిసిందే? బుధవారమే (15)న సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఆమె తక్షణమే దీన్ని విచారించాలని అభ్యర్థన పెట్టుకున్నప్పటికీ కోర్టు ఆమె రిక్వస్ట్‌ను తిరస్కరించింది. ఈనేపథ్యంలో విచారణకు హాజరుకావాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే.. సీఆర్‌పీసీ సెక్షన్ 160 ప్రకారం మహిళలను వారి ఇంటికే వెళ్లి విచారించాలని రూల్స్ ఉన్నాయని, దీనికి వ్యతిరేకంగా తనను ఈడీ ఆఫీస్‌కు పిలిచి విచారించిందని సుప్రీం కోర్టుకు తెలిపారు కవిత. అంతేకాకుండా మరో తేదీ చెప్పాలని అప్పుడు కచ్చితంగా విచారణకు హాజరవుతారని రిక్వస్ట్ చేశారు కవిత. అయితే.. దీనిపై ఈడీ ఎలా రియాక్ట్ అవుతుందనేది ఇప్పుడు వేచి చూడాలి.

# చాట్ జీపీటీ 4

(మొదటిపేజీ తరువాయి)

మంది ఆసక్తి చూపుతున్నారు. "మేం జీపీటీ-4ను క్రియేట్ చేశాం. డీప్ లెర్నింగ్‌లో మరింత ముందుకు వెళ్లేందుకు ఓపెన్ ఏఐకి ఇది ఓ మైలురాయిగా నిలిచింది" అని ఓపెన్ ఏఐ తన బ్లాగ్‌లో వెల్లడించింది. కొన్ని ప్రొఫెషనల్, అకడమిక్ టాస్కులను ఈ జీపీటీ-4 మనిషి స్థాయిలో చేస్తుందని వెల్లడించింది.జీపీటీ-4 మరింత క్రియేటివ్‌గా ఉంటుందని ఓపెన్ ఏఐ పేర్కొంది. "జీపీటీ-4 మోడల్ ఇంతకు ముందు కంటే మరింత క్రియేటివ్‌గా ఉంటుంది. క్లిష్టతరమైన ప్రశ్నలు, ప్రాబ్లమ్‌లకు చాలా కచ్చితత్వంతో సమాధానాలు ఇస్తుంది" అని ఓపెన్ ఏఐ ప్రకటించింది. అప్‌డేట్‌తో జీపీటీ-4 టెక్స్ట్ రెస్పాన్స్ చాలా వేగంగా ఉండనుంది. భవిష్యత్తులో ఇమేజ్‌ల రూపంలో ప్రశ్నలు అడిగినా సమాధానాలు చెప్పేలా జీపీటీ-4 ఉండనుంది. ఉదాహణకు, రిఫ్రిజిరేటర్ లోపలి భాగాన్ని ఫొటో తీసి జీపీటీ-4లో అప్‌లోడ్ చేస్తే అందులోని వాటిని బట్టి ఏ వంట చేసుకోవచ్చో? ఎలా చేసుకోవచ్చో జీపీటీ-4 చెబుతుంది. ఇలా ఏదైనా ఫొటోలను అప్‌లోడ్ చేస్తే ఇందులోని వాటిని బట్టి వాటికి సంబంధించిన ఔట్‌పుట్ ఇస్తుంది. కాగా, ప్రస్తుతం టెక్స్ట్ రూపంలో ప్రశ్నలు అడితే.. టెక్స్ట్ రూపంలోనే వివరంగా సమాధానాలు ఇస్తోంది ఈ ఏఐ చాట్‌బోట్‌ఓపెన్ ఐఏ పెయిడ్ సబ్‌స్క్రిప్షన్ చాట్‌జీపీటీ ప్లస్ ద్వారా జీపీటీ-4 ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ఈ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ ఉన్న వారు చాట్‌జీపీటీలో ఈ జీపీటీ-4ను యాక్సెస్ చేసుకోవచ్చు.జీపీటీ-4తో కూడిన బింజ్ సెర్చ్ ఇంజిన్‌ను మైక్రోసాఫ్ట్ ప్రస్తుతం టెస్ట్ చేస్తోంది.టెక్స్ట్ రూపంలో ఏదైనా ప్రశ్న అడిగితే.. చాట్‌జీపీటీ వివరంగా, వేగంగా టెక్స్ట్ రూపంలో సమాధానాలు ఇస్తుంది. అడిగిన ప్రశ్నకు ఓ ఆన్సర్‌ను అందుబాటులో ఉన్న వివరాలన్నింటితో కలిపి ఇస్తుంది. కోడింగ్, మ్యాథమేటిక్స్, హిస్టరీ, రెసిపీలు ఇలా ఒక్కటేంటి ఏ అంశానికి సంబంధించిన ప్రశ్న అడిగినా చాట్ జీపీటీ ఆన్సర్ ఇస్తుంది. దీంతో అత్యంత వేగంగా ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది యూజర్లను ఈ చాట్‌జీపీటీ దక్కించుకుంది.

# మాగుంటకు ఈడీ నోటీసులు

**న్యూఢిల్లీ:**

దిల్లీ లిక్కర్ స్కామ్ లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డికి ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 18న విచారణకు హాజరుకావాలని ఈడీ నోటీసులు ఇచ్చింది. ఈ కేసులో ఇప్పటికే మాగుంట శ్రీనివాసులు రెడ్డి కుమారుడు రాఘవను ఈడీ అరెస్టు చేసింది. ఆయన తీహాడ్ జైల్ లో ఉన్నారు. దిల్లీ లిక్కర్ స్కామ్ లో ఈడీ అధికారులు స్పీడ్ పెంచారు. ఈ కేసులో వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డికి ఈడీ నోటీసులు జారీచేసింది. ఈ నెల 18న విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చింది. ఇప్పటికే దిల్లీ లిక్కర్ కేసులో 11 మంది అరెస్ట్ అయ్యారు. దిల్లీ లిక్కర్ స్కామ్ లో సౌత్ గ్రూప్ లో కీలకంగా ఉన్న మాగుంట శ్రీనివాసులు రెడ్డికి నోటీసులు ఇవ్వడంతో మరింత వేగం పెంచింది ఈడీ. ఈ కేసులో ఇప్పటికే మాగుంట శ్రీనివాసులు రెడ్డి కుమారుడు మాగుంట రాఘవను ఈడీ అరెస్టు చేసింది. ఈ కేసులో కీలకంగా ఉన్న అరుణ్ రామచంద్రపిళ్లైని ఈడీ కోర్టులో



హాజరుపర్చింది. ఆయనకు ఐదు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోరింది. విచారణ ఇంకా పూర్తి కాలేదని, మరికొన్ని రోజులు విచారించాల్సి ఉందని కోర్టుకు తెలిపింది. అయితే కోర్టు మాత్రం అరుణ్ రామచంద్ర పిళ్లైని మూడు రోజుల పాటు మాత్రమే కస్టడీకి అనుమతించింది. దిల్లీ లిక్కర్ స్కామ్ లో దర్యాప్తు సంస్థలు విచారణ వేగవంతం చేస్తున్నాయి. ఈ కేసుతో సంబంధం ఉన్న కీలక నేతలను సీబీఐ అరెస్టు చేస్తుంది. ఈ కేసులో ఒంగోలు వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కుమారుడు మాగుంట రాఘవను ఫిబ్రవరి 10న ఈడీ అరెస్టు చేసింది. ఆయనకు కోర్టు జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. ఇప్పటికే పలుమార్లు మాగుంట రాఘవ కస్టడీ పొడిగించింది కోర్టు. మాగుంట రాఘవ ప్రస్తుతం తిహాడ్ జైలులో ఉన్నారు. దిల్లీ లిక్కర్ స్కాంకు సంబంధించి మాగుంట రాఘవరెడ్డిని ఫిబ్రవరి 10న ఈడీ అరెస్టు చేసింది. అనంతరం దిల్లీలోని రౌస్ ఎవెన్యూ కోర్టు రిమాండ్ విధించింది. ఈ కేసుకు సంబంధించి వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి కొడుకు రాఘవ రెడ్డిని ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. కోర్టుకు సమర్పించిన ఛార్జ్‌షీట్‌లో ఈడీ.. మాగుంట శ్రీనివాసులు రెడ్డి, రాఘవ రెడ్డి పేర్లను ప్రస్తావించింది. దిల్లీ లిక్కర్ స్కామ్‌కు సంబంధించి సౌత్ గ్రూప్ నుంచి రూ. 100 కోట్ల ముడుపులను విజయ్ నాయర్ సేకరించి ఆప్ నేతలకు అందించారనే ఆరోపణలు ఉన్నాయి. సౌత్ గ్రూప్‌లో శరత్ చంద్ర, అభిషేక్ బోయినపల్లి, ఎమ్మెల్సీ కవిత, మాగుంట సహా పలువురు ఉన్నారని ఈ కేసులో నిందితుడిగా ఉన్న అమిత్ అరోరా రిమాండ్ రిపోర్టులో ఈడీ పేర్కొంది. ఈ క్రమంలోనే మాగుంట శ్రీనివాసులు రెడ్డి, రాఘవరెడ్డి నివాసాల్లో దర్యాప్తు సంస్థలు సోదాలు కూడా నిర్వహించాయి.

# 7 నుంచి రామాయణ్ యాత్ర భారత్ గౌరవ ట్రైన్

(మొదటిపేజీ తరువాయి)



గౌరవ్ రైళ్లను ప్రారంభించారు. ఈ ఎయిర్ కండిషన్డ్ రైలులో రెండు రెస్టారెంట్లు, మోడర్న్ కిచెన్, సెన్సర్ బేస్డ్ వాష్ రూమ్ ఫంక్షన్స్, కోచెస్ లో షోవర్ క్యూబికల్స్, ఫుట్ మసాజర్స్.. మొదలైన సౌకర్యాలుంటాయి. ఇందులో ఫస్ట్ ఏసీ, లేదా సెకండ్ ఏసీ లో ప్రయాణించవచ్చు.ఏప్రిల్ 7 న ఢిల్లీలోని సఫ్దర్ జంగ్ రైల్వే స్టేషన్ నుంచి ఈ ట్రైన్ శ్రీ రామాయణ యాత్ర కు బయల్దేరుతుంది. 18 రోజుల యాత్ర అనంతరం తిరిగి ఢిల్లీ చేరుకుంటుంది. ఈ యాత్రలో భాగంగా మొదట అయోధ్య చేరుకుంటుంది. అక్కడ భక్తులు శ్రీరామ జన్మభూమి ఆలయం, హనుమాన్ ఆలయం, సరయు హారతి లను దర్శించవచ్చు. అక్కడి నుంచి సీ బిహార్ లోని సీతామర్హి కి వెళ్తారు. అక్కడ సీతాదేవి జన్మస్థలంగా భావించే ప్రాంతాన్ని, నేపాల్ లోని జానకిపూర్ లో ఉన్న రామజానకి ఆలయాన్ని రోడ్డు మార్గాన సందర్శిస్తారు. ఆ తరువాత వరుసగా బక్సర్ లోని రామ్ రేఖా ఘాట్, రామేశ్వరనాథ ఆలయం, గంగానదీ స్నానం మొదలైనవి ఉంటాయి. అక్కడి నుంచి వారణాసి, ప్రయాగరాజ్, చిత్రకూట్ లను సందర్శిస్తారు. అక్కడి నుంచి నాసిక్, హంపి, రామేశ్వరం మీదుగా భద్రాచలం చేరుకుంటారు. అక్కడి నుంచి చివరగా నాగపూర్ వెళ్తారు. అనంతరం తిరిగి ఢిల్లీ చేరుకుంటారు. మొత్తంగా ఈ ప్రయాణంలో 7500 కిమీలు ప్రయాణిస్తారు. ఈ శ్రీ రామాయణ యాత్ర చేయాలనుకునేవారు సెకండ్ ఏసీలో ప్రయాణించాలనుకుంటే ఒక్కొక్కరు రూ. 1,14,065 చెల్లించాల్సి ఉంటుంది. ఫస్ట్ ఏసీ క్లాస్ క్యాబిన్ కావాలనుకునేవారు ఒక్కొక్కరు రూ. 1,46,545, ఫస్ట్ ఏసీ కూపే కావాలనుకునేవారు ఒక్కొక్కరు రూ. 1,68,950 చెల్లించాల్సి ఉంటుంది. ట్రైన్ జర్నీతో పాటు ఏసీ హోటల్స్ లో వసతి, శాఖాహార భోజనం, ఏసీ వాహనాల్లో సైట్ సీయింగ్.. మొదలైన వసతులన్నీ ఈ ప్యాకేజీలోనే లభిస్తాయి.

# మార్చి నుంచి జూలైకి మార్పు

**విజయవాడ :**

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విశాఖపట్నం తరలి వెళ్తారని మూడున్నరేళ్లుగా చెబుతున్నా ఆచరణలో మాత్రం ఆ కోరిక తీరేలా కనిపించడం లేదు. 2019 డిసెంబర్‌లో అసెంబ్లీ సాక్షిగా ప్రకటన చేసిన జగన్మోహన్ రెడ్డి ఆ వెంటనే అసెంబ్లీలో తీర్మానాలను నెగ్గించుకుని వైజాగ్ ఎగిరిపోవాలనుకున్నారు. ముఖ్యమంత్రి ఆలోచన ఒకలా ఉన్నా పరిస్థితులు మాత్రం భిన్నంగా సాగాయి. అసెంబ్లీలో రాజధాని వికేంద్రీకరణ, సిఆర్‌డిఏ రద్దు బిల్లులు శాసన సభలో అమోదం పొందినా మండలిలో మాత్రం నెగ్గలేదు. ఈలోపు కోవిడ్ ముంచుకొచ్చింది. రెండేళ్లు కోవిడ్‌తోనే సరిపోయింది. కోవిడ్ పరిస్థితులు చక్కబడిన తర్వాత పరిస్థితులు తనకు అనుకూలంగా మారుతాయని ముఖ్యమంత్రి భావించినా అలా జరగలేదు. కోర్టు కేసులు, ఆంక్షలు, ఆందోళనలు, విమర్శలు కొనసాగుతూనే ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్‌లో అన్ని ప్రాంతాల అభివృద్ధికి విశాఖపట్నాన్ని రాజధానిగా చేయడమే మార్గమని జగన్మోహన్ రెడ్డి భావించారు. అమరావతి మీద పెట్టుబడులు పెట్టడం కంటే కాస్మోపాలిటిన్ నగరంగా ఉన్న విశాఖను రాజధాని చేస్తే రాష్ట్రం త్వరగా అభివృద్ధి చెందుతుందని భావించారు. ముఖ్యమంత్రి ఆలోచనను ప్రతిపక్షాలు వ్యతిరేకించినా, కోర్టుల్లో వివాదాలు తలెత్తిన సిఎం మాత్రం వెనకడుగు వేయలేదు. బిల్లులు నెగ్గకపోవడానికి మండలిలో బలం లేకపోవడమేనని భావించి ఏకంగా శాసన మండలిని రద్దు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఎన్ని చేసినా సిఎం మాత్రం తన ఆలోచనల్లో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోయారు.రాజధాని వికేంద్రీకరణ విషయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏకపక్ష నిర్ణయాలు, పర్యవసానాలు ఆలోచించని తీరు, కోర్టు వివాదాలతో తలెత్తే పరిస్థితుల్ని బేరీజు వేయకపోవడమే అడ్డంకులు ఎదురవడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ముఖ్యమంత్రి ఆలోచనలకు అడ్డు చెప్పే వారు, వాటిలో సాధ్యాసాధ్యాలను వివరించే వారు ఆయన దగ్గర ఎవరు లేరనే విమర్శ ఉంది. ముఖ్యమంత్రికి ఎదురు చెప్పే సాహసం, సలహాలిచ్చే ధైర్యం నాయకుల్లోను, బ్యూరోక్రట్లలోను లేదనే విమర్శ ఉంది. ఈ కారణంగానే రాజధాని తరలింపు విషయంలో తరచూ బ్రేకులు పడుతున్నాయినిజానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విశాఖపట్నం నుంచి పరిపాలన సాగించాలనుకుంటే దానికి పెద్దగా అడ్డంకులు ఎదురయ్యేవి కాదు. ముఖ్యమంత్రి ఎక్కడి నుంచైనా పరిపాలనా వ్యవహారాలు సాగించే వెసులుబాటు ఉంది. ముఖ్యమంత్రి ఎక్కడ ఉంటే అదే ముఖ్యమంత్రి కార్యాలయం అవుతుంది. అదే సమయంలో రాజధాని విషయంలో అన్ని వర్గాలను ఒప్పించడానికి బదులు ఏకపక్షంగా వ్యవహరించారనే అపవాదు మూటగట్టుకున్నారు. ఖర్చుకు వెనుకాడి అమరావతి నిర్మాణాన్ని పక్కనపెట్టినా, ఆ విషయంలో ప్రభుత్వ వాదన, వివరణల్ని ప్రజల్లోకి తీసుకెళ్ళడంలో విఫలమయ్యారు.వేలు, లక్షల కోట్ల రుపాయల వ్యయాన్ని అమరావతిపై చేయడం దండగని చెప్పడం తప్ప, విశాఖకు ఉన్న అనుకూలతల విషయంలో ప్రజలకు వివరణ ఇచ్చే ప్రయత్నం అంతంత మాత్రంగానే చేశారు. హైకోర్టులో ఏపీ ప్రభుత్వానికి ఎదురు దెబ్బ తగిలిన తర్వాత సుప్రీం కోర్టును ఆశ్రయించారు. పదేపదే సుప్రీం కోర్టు తలుపు తట్టడం ద్వారా విశాఖపట్నానికి తరలిపోవాలనే తొందరపాటుతనాన్ని ప్రజల ముందు బయటపెట్టుకున్నారు.విశాఖ గ్లోబల్ సమ్మిట్‌కు ముందు కూడా సుప్రీం కోర్టులో సానుకూల నిర్ణయం కోసం పదేపదే ప్రయత్నాలు చేశారు. అవి కూడా ఫలించలేదు. త్వరలో విశాఖపట్నం నుంచి ఆంధ్రప్రదేశ్ పరిపాలనా వ్యవహారాలను సాగిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించినా అది ఎప్పటి నుంచి అనేది మాత్రం ఖచ్చితంగా చెప్పలేకపోతున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం మాదిరి గడువు మీద గడువు పెంచుకుంటూ పోవడం తప్ప ప్రస్తుతానికి ప్రభుత్వానికి చేయగలిగింది కూడా ఏమి లేని పరిస్థితి నెలకొంది.రాజధాని తరలింపు, అమరావతి నిర్మాణం మీద సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్ల పీటముడి వీడే వరకు ముఖ్యమంత్రి చేయగలిగేది కూడా ఏమి లేదనే భావన ఉంది. ఇప్పటికిప్పుడు సుప్రీం కోర్టులో వాదనలు పూర్తి చేసి, ఏపీ హైకోర్టు తీర్పుపై స్టే లభించడంపై కూడా ప్రభుత్వానికి పూర్తి నమ్మకం లేదు. కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్న సమయంలో మరోసారి అసెంబ్లీలో బిల్లులు అమోదింప చేసుకుంటారా అనే సందేహాలు కూడా ఉన్నాయి. రాజధాని వికేంద్రీకరణ బిల్లుల్ని ఉభయసభల్లో అమోదింప చేసుకున్నా అవి కోర్టు తీర్పులకు లోబడతాయా అనే చర్చ కూడా ఉంది.

# చిత్తూరు ప్రేమ కథా చిత్రమ్

**తిరుపతి:**

సోషల్ నెట్ వర్కింగ్ సైట్లు చదువురు రాని వారు కూడా బాగా ఉపయోగించడం ప్రారంభించిన తర్వాత లవ్ స్టోరీలు కూడా పెరిగిపోయాయి. ఆన్ లైన్‌లో చాటింగ్ చేసుకోవడం.. పెళ్లి చేసుకోవడం కోసం ఎక్కడి నుంచో మరెక్కడికో వెళ్లడం. అక్కడ మోసపోవడం వంటివి తరచూ జరుగుతూ ఉంటాయి. కొన్ని సక్సెస్ కూడా అవుతాయి.. అది వేరే విషయం. కానీ ఓ లవ్ స్టోరీ మాత్రం గమ్యానికి చేరకుండా మధ్యలో ఆగిపోయింది. ఎక్కడో కాదు మన చిత్తూరులోనే. ఝూర్ఖండ్ రాష్ట్రానికి చెందిన పాయల్ కౌతా కు అస్సాంకు చెందిన ఎంఎస్.బాబుతో ఫేస్ బుక్ ద్వారా పరిచయం అయ్యాడు.. ఎంఎస్.బాబు బెంగుళూరులో చిన్న ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. వీరి సోషల్ మీడియా చాటింగ్‌లు ప్రేమకు దారి తీశాయి. గత రెండేళ్లుగా ఆన్ లైన్‌లోనే ప్రేమించుకుంటున్నారు. ఒక్క సారి కూడా కలుసుకోలేదు. ఈ లోపు పాయల్‌కు ఇంట్లో వాళ్లు వివాహ సంబంధాలు చూశారు. తాను ఇంట్లో చూపించిన వాని పెళ్లి చేసుకోనని.. తనను తీసుకెళ్లాలని ఎంఎస్ బాబును పాయల్ కోరింది.అయితే దానికి ఎంఎస్ బాబు ఒప్పుకోలేదు. కానీ చనిపోతానని హెచ్చరించడంతో సరే బెంగళూరు రమ్మన్నాడు. పాయల్ ప్రియుడు పిలిచాడు కదా అని ఇంట్లో వాళ్లకు చెప్పకుండా ఝూర్ఖండ్‌లో బెంగళూరు వెళ్లేందుకు రైలెక్కింది. పాయల్ కనిపించ కపోవడంతో కుటుంబసభ్యులు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. పోలీసులు బస్సు, రైల్వే స్టేషన్ సీసీ కెమెరా లను పరిశీలించారు. పాయల్ ట్రైన్ ఎక్కినట్లు గుర్తించి రైల్వే అధికారులను సమాచారం ఇచ్చారు. ఫోటో, వివరాలను పంపారు. అప్రమత్తంమైన రైల్వే పోలీసులు చిత్తూరు చేరుకున్న తర్వాత పాయల్‌న ?గుర్తించారు ఈ క్రమంలో ఈ నెల 12వ తేదీన అర్ధరాత్రి 1:30 గంటలకు చిత్తూరు రైల్వే స్టేషనులో పాయల్ కౌతాను గుర్తించి రైల్వే పోలీసులు చిత్తూరులోని వన్ స్టాప్ సెంటర్ కు తరలించి.. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.. పాయల్ కుటుంబసభ్యులు రావడంతో కౌన్సిలింగ్ ఇచ్చి వారికి అప్పగించారు. ఎంఎస్ బాబుతోనూ పోలీసులు మాట్లాడారు. పాయల్ బెంగుళూరుకి ఇంట్లో చెప్పకుండా వస్తున్నట్లు ఎంఎస్.బాబుకి తెలియజేయడంతో పాయల్ ను తిరిగి తన కుటుంబ సభ్యులకే అప్పగించాలని కోరాడు. దీంతో ఆ లవ్ స్టోరీకి అక్కడ తెరపడింది. పాయల్ ను తీసుకుని కుటుంబసభ్యులు ఝూర్ఖండ్ వెళ్లిపోయారు.

# ఉమా చిట్స్ బాధితులకు పరిహారం

**విజయవాడ:**

బెజవాడలో సంచలనం రేకెత్తించిన ఉమా చిట్స్ వ్యవహారంపై వైసీపీ ప్రభుత్వం దృష్టి సారించింది. 2012లో ఉమా చిట్స్ వ్యవహారం విజయవాడ నగరంలో సంచలనం రేపింది. బాధితులకు పరిహారం ఇప్పించేదిశగా ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది.ఉమా చిట్ ఫండ్ కేసును వేగవంతం చేయాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. ఈ మేరకు సచివాలయంలోని తన ఛాంబర్లో సమీక్ష నిర్వహించారు. హోం మంత్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు, ప్రిన్సిపల్ హోం సెక్రటరీ హరీష్ కుమార్ గుప్తా, ఎన్టీఆర్ జిల్లా కమిషనర్ క్రాంతి రాణా టాటా, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గడ్డం రవి కిషోర్ పాల్గొన్నారు. 2012 నుంచి కేసు పెండింగ్ లో ఉందని.. ప్రతి ఒక్క బాధితుడికి న్యాయం జరిగే విధంగా చొరవ చూపాలని ఈ సందర్భంగా మల్లాది విష్ణు హోం మంత్రి తానేటి వనిత ను కోరారు. బాధితులందరిని ఆదుకుంటామని.. ఈనెల 17 నుంచి కేసుకు సంబంధించిన విచారణ మొదలవుతుందని మంత్రి తానేటి వనిత తెలియజేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బాధిత కుటుంబాలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందన్నారు. ఉమా చిట్స్ ఆస్తులు అమ్మకానికి పెట్టి బాధిత కుటుంబాలను ఆదుకునే దిశగా చర్యలు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఏప్రిల్ 9న మరోసారి భేటీ కావాలని నిర్ణయించినట్లు మంత్రి తానేటి వనిత తెలియజేశారు.ఉమా చిట్స్ అంటేనే బెజవాడ వాసులకు కంటిపై కునుకు లేకుండా చేసిన ఘటన. 2012సంవత్సరంలో ఈ సంఘటన వెలుగు లోకి వచ్చింది. విజయవాడ సత్యనారాయణపురానికి చెందిన ఉమామహేశ్వరరావు ఉమా చిట్స్ ను నిర్వహించారు. చిట్స్ నిబందనలకు పూర్తిగా విరుద్దంగా చాలా మంది వద్ద లక్షల రూపాయలు సేకరించారు. అలా సేకరించిన నిదులతో పెద్ద ఎత్తున రిసార్ట్స్ ను నిర్వహించారు. చాలా చోట్ల పెట్టుబడులు పెట్టి అవి నష్టపోయినట్లుగా చూపించారు. అనేక చోట్ల ఆస్తులను కొనుగోలు చేశారు. వాటిని దాచిపెట్టి బాధితులకు ఇవ్వాల్సిన నగదును ఇవ్వకుండా ఎగ్గొట్టారు. దీంతో పెద్ద ఎత్తున బాదితులు అప్పటి విజయవాడ పోలీస్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు.సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ లో బాదితులు క్యూ కట్టి మరి ఉమా చిట్ ఫండ్స్ పై ఫిర్యాదు చేశారు.ఆర్దిక మోసం కింద కేసులు నమోదు చేశారు. ఉమా చిట్స్ అదినేత ఉమా మహేశ్వరరావు ను కూడ పోలీసులు తరువాత కాలంలో అరెస్ట్ చేశారు.ఉమా చిట్స్ అనగానే మోసపోయిన బాధితులకు గుండె వేగంగా కొట్టుకుంటుంది. ఈ వ్యవహారం అప్పట్లో రాజకీయంగా సంచలనంగా మారింది. నిర్వాహకులకు కాంగ్రెస్ ప్రభుత్వంలోని పెద్దలు అండగా నిలబడ్డారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో బాధితులకు పూర్తిగా న్యాయం చేస్తామని అప్పటి కాంగ్రెస్ నేత, ఇప్పుడు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా ఉన్న మల్లాది విష్ణు హామి ఇచ్చారు. దీంతో ఇప్పుడు మరోసారి ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఉమా చిట్స్ కు సంబంధించిన ఆస్తులను కోర్టుకు వివరించి వాటిని విక్రయించటం ద్వారా బాధితులకు ఇవ్వాల్సిన నగదును తిరిగి చెల్లించాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో బాధితుల పక్షాన హోం మంత్రి తానేటి వనితతో పాటుగా పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉమా చిట్స్ కు సంబంధించిన ఆస్తుల విలువ ప్రస్తుతం కోట్లలో ఉండటంతో వాటిని విక్రయించి.. బాధితులను ఆదుకోవటానికి అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. అయితే చట్టపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పరిగణనలోకి తీసుకుంటామని హోం మంత్రి తానేటి వనిత అన్నారు.

# జాతీయ నాయకులతో నో టెన్షన్...


## ఇబ్బందంతా లోకల్ లీడర్లతోనేనా

**రాజమండ్రి:**

ఆంధ్రప్రదేశ్ బీజేపీ నేతలపై పవన్ మచిలీపట్నంలో జరిగిన జనసేన ఆవిర్భావ సభలో విరుచుకుపడ్డారు. అసలు ఎదగలేకపోవడానికి ఆ పార్టీనే కారణం అని నిందించారు. అంటే.. ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ నేతల పై ఆయన తన అసంతృప్తిని చాలా స్పష్టంగా బయట పెట్టారు. కేంద్ర నాయకత్వంలో ఉన్న భారతీయ జనతా పార్టి నేతలకు క్లారిటి ఉంది కాని, ఆంధ్రప్రదేశ్ లో ఉన్న నాయకులతో తనకు గ్యాప్ ఉందని ఆయన నేరుగా ప్రకటించటం చర్చనీయాశంగా మారింది. భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ నేతల పై పవన్ చేసిన కామెంట్స్ ఇప్పుడు చర్చనీయాశంగా మారాయి.అమరావతి మెదలుగొని, ఆంధ్రప్రదేశ్ లో బీజేపీని బలోపేతం చేసే విషయం వరకు కాషాయ దళం తీరు పై పవన్ కీలక వ్యాఖ్యలు చేశారు.కేంద్రంలో ఉన్న భారతీయ జనతా పార్టిలో తనను ముందుగా పిలిచింది నరేంద్ర మోడీ అని ఆయన అంటే తనకు గౌరవం ఉందని పవన్ అన్నారు.ఆ తరువాత భారతీయ జనతా పార్టి లోని ఇతర నేతలతో కలసి సమావేశంలో చర్చించుకున్న అంశాలు, రాష్ట్రాని వచ్చే సరికి ఎందుకో అమలు కాలేదని పవన్ వ్యాఖ్యానించారు. అందుకు కారణాలు కూడా బీజేపీ నేతలే చెప్పాల్సి ఉందన్నారు. పొత్తులో ఉన్నామని చెబుతూ.. ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ నాయకత్వం పై పవన్ కౌంటర్లు వేశారు. జాతీయ నాయకత్వంతో చర్చలు తరువాత వాటి కొనసాగింపు చర్యలు ఆంధ్రప్రదేశ్ లో ఉండాల్సి ఉండగా, అందుకు భిన్నంగా ఇక్కడ ఉన్న నాయకుల వైఖరి ఉందని పవన్ కళ్యాణ్ చెప్పారు. ఈ వ్యవహారంలో తనకు పూర్తి అవగాహన ఉందని అయితే ఏపీ బీజేపీ నేతలు మాత్రం ఎందుకనో మౌనంగా ఉంటున్నారని పవన్ వ్యాఖ్యానించారు.దీంతో ఇరు పార్టీల మధ్య ఉన్న గ్యాప్ అంశం పై ఇప్పటి వరకు ఉన్న రుమార్స్ కాస్త,వాస్తవమే అనే అభిప్రాయం ఇ స్పష్టం అయ్యిందని అంటున్నారు.ఆంధ్రప్రదేశ్ బీజేపీ నేతల తీరు ఇప్పటికి చర్చనీయాశంగా నే ఉంది. సొంత నేతలు విమర్శలు,ఆరోపణలు చేస్తున్నా ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు వాటిని పట్టించుకోకపోవటం, కనీసం వారిని పిలిచి మాట్లాడకపోవటం,తో చాలా మంది పార్టీని వీడుతున్నారు. పార్టీని వీడుతున్నట్లుగా తెలిసినా కనీసం కన్నా లక్ష్మినారాయణను పార్టీ అగ్రనేతలు పిలిచి మాట్లాడేందుకు కూడా ప్రయత్నించలేదు.ఇ దే పార్టీకి పెద్ద మైనస్ గా చెబుతున్నారు. కన్నా పార్టీలో ఉండగా కూడ పవన్ కళ్యాణ్ ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. పవన్ ను భారతీయ జనతా పార్టీ సరిగ్గా వినియోగించుకోవటం లేదని నేరుగా చెప్పారు. అప్పుడు కూడ భారతీయ జనతా పార్టీ నేతలు కనీసం స్పందించలేదు.. ప్పుడు చివరకు పొత్తులో కంటిన్యూ అవుతున్న పవన్ కళ్యాణ్ కూడ బారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖ నాయకత్వం పై చేసిన కామెంట్స్ కూడ అదే స్దాయిలో ఉన్నాయి. కేంద్రంలోని నాయకత్వంతో సంప్రదింపులు చేసిన తరువాత ఆంధ్రప్రదేశ్ లో భారతీయ జనతా పార్టీ నాయకులు కలసి పని చేసేందుకు ముందు కు రాకపోవటం వలనే రాష్ట్రంలో తెలుగు దేశం బలపడగలిగిందని పవన్ కళ్యాణ్ మరింత ఘాటుగా వ్యాఖ్యానించారు.దీని పై కూ బీజేపీ నాయకులు ఎలా రియాక్ట్ అవుతారన్నది వేచి చూడాల్సి ఉంది.

# రాటు తేలుతున్న పవన్ కళ్యాణ్

**విజయవాడ:**



జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ స్టైల్ మార్చారా.. ఎక్కడ నెగ్గాలో కాదు... ఎక్కడ తగ్గాలో తెలుసుకున్నారా.. జనం కనిపించగానే స్టేజ్ పై ఊగిపోయి, ఆవేశంతో తేల్చుకుందాం అని సవాల్ చేసే పవన్ ఈ సారి చాలా కూల్ గా మాట్లాడారు. దీంతో మచిలీపట్నం జనసేన సభలో పవన్ ప్రసంగం తీరుపై చర్చ నడుస్తోంది.జనసేన పార్టీ 10వ వ్యవస్థాపక దినోత్సవాన్నిపురస్కరించుకొని మచిలీపట్టణంలో భారీ బహిరంగ సభను నిర్వహించారు పవన్ కళ్యాణ్. అయితే వేదిక పై పవన్ చేసిన ప్రసంగం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాశంగా మారింది. ఇందుకు కారణాలు చాలా ఉన్నాయి. వేదికపై పవన్ ప్రసంగం, ఆయన హావభావాలపై ప్రత్యేకంగా చర్చ జరుగుతోంది. గతంలో నిర్వహించిన సభల్లో పవన్ ప్రసంగించిన తీరు, ఈ సారి పవన్ ప్రసంగించిన తీరును బేరీజు వేసుకునే పరిస్థితి పొలిటికల్ సర్కిల్ లో కనిపిస్తోంది. పవన్ సభ అనగానే మెదటినుంచి చివరి వరకు గందరగోళంగా నిర్వహించే కార్యక్రమం అని ప్రచారంలో ఉంది. సభ వేదికపై పవన్ మాట్లాతూ ఆవేశంగా వ్యాఖ్యలు చేయటం, తల ఊపేస్తూ, మరో చేత్తో తలపై నుండి ముందుకు పడుతున్న వెంట్రుకలను వెనక్కి తోసుకుంటూ శరీరం మెత్తం ఊపేస్తూ ప్రసంగం సాగేది. దీంతో అభిమానులు కూడా పూనకాలు వచ్చి ఊగిపోయేవారు. పవన్ ప్రసంగం అంటేనే తలతోక ఉండదని, ఎక్కడ మెదలు పెట్టి ఎక్కడ ఆపుతారో తెలిసేది కాదన్న వాదన వినిపించేది. ఈ క్రమంలోనే మచిలీపట్నంలో మంగళవారం నిర్వహించిన సభలో పవన్ ప్రసంగించిన తీరు భిన్నంగా ఉందని పొలిటికల్ సెక్టార్స్ లో కామెంట్స్ నడుస్తున్నాయి. వేదిక పై పవన్ చాలా కూల్ గా మాట్లడటం ప్రధాన అంశంగా చెబుతున్నారు. అంతే కాదు తాను చెప్పాలనుకున్నది స్పష్టంగా చెప్పేందుకు పవన్ చాలా ప్రయత్నించారని వినిపిస్తోంది. అక్కడక్కడా గ్యాప్ తీసుకున్నప్పటికి పవన్ తాను అనుకున్న విషయాలను రాసుకొని వచ్చిన పేపర్ లు చదివి మరి స్పష్టంగా చెప్పేందుకు ప్రయత్నించారని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయితాజా రాజకీయ పరిణామాలపై పవన్ సభలో చేసిన ప్రసంగం చాలా విపులంగా జరిగింది. సాధారణంగా పవన్ ప్రసంగం అనగానే ఆద్యంతం అభిమానులు కేరింతలు కొడుతూనే ఉండటం, ప్రసంగానికి అడ్డు తగలటం కామన్ గా కనిపించేది. అయితే ఈసారి అలాంటి వాటిని పవన్ పట్టించుకోనని స్పష్టంగా చెప్పటంతో పాటుగా దాదాపుగా గంటన్నర కు పైగా సాగిన ప్రసంగం పార్టీ కార్యకర్తలను ఆలోచనలో పడేసే ప్రయత్నం చేశారు పవన్. అధికార పక్షాన్ని టార్గెట్ గా చేసుకొని పవన్ ప్రసంగం ఉంటుందని అంతా ఊహించారు. అయితే అందుకు భిన్నంగా పవన్ కులం, మతం వర్గ భేదాలు ఉండకూడదని, తాను అందరివాడినంటూ కామెంట్స్ చేశారు. వైఎస్ జగన్ ప్రభుత్వంపై చాలా తక్కువ గా విమర్శలు చేశారు. ప్రధానంగా ఇసుక, గంజాయి, శాంతి భద్రతలకు సంబందించిన అంశాలను పవన్ కీలకంగా ప్రస్తావించారు. దీంతో వాటిపై అందరి అటెన్షన్ ఉండేలా పవన్ తన ప్రసంగంలో జాగ్రత్తలు పడ్డారని అంటున్నారు.పవన్ సభ అనగానే చాలా మంది పొత్తుల అంశం పై తేల్చేస్తారని ఎదురు చూశారు. కానీ వచ్చే ఏడాది విజయం సాధించి ఆవిర్భావ దినోత్సవం చేసుకుందామంటూ పవన్ ప్రసంగాన్ని ముగించారు. అదే సందర్భంలో 175సీట్లలో పోటీ చేయాలని అధికార పక్షం నుంచి వచ్చిన డిమాండ్లపై పవన్ క్లారిటీ ఇచ్చారు. జనసేన పార్టీ ఎన్ని స్దానాల్లో పోటీ చేయాలో మీరే చెబుతారా.. మీ పని మీరు చూసుకోండంటూ పరోక్షంగా కౌంటర్ ఇచ్చారు. ఇక టీడీపీతో పొత్తు, సీట్లు ఆఫర్ పై పవన్ చాలా క్లారిటీ ఇచ్చారు. పొత్తుల్లో భాగంగా 20 సీట్లు టీడీపీ ఇస్తుందని వాట్సాప్ లలో వచ్చే ప్రచారాలు నమ్మదన్నారు. ఇలా వరుసగా ఒక్కో అంశంపై పవన్ ప్రశాంతంగా ఆలోచించి పేపర్ పై ముందుగా రాసుకొచ్చిన అంశాలను ప్రస్తావిస్తూ చేసిన ప్రసంగం, గత ప్రసంగాలకు భిన్నంగా జరిగిందని రాజకీయ విశ్లేషకుల్లో చర్చ జరుగుతోంది.

# 48 వేలు దాటిన ఎర్రబంగారం

**కర్నూలు:**



మిర్చి ఎర్రబంగారంగా మారింది. బంగారంతో పోటీ పడుతూ దూసుకుపోతున్నాయి ఎండు మిర్చి ధరలు. మార్కెట్‌కు సరుకు కాస్త తక్కువగా వస్తూ ఉండటంతో.. డిమాండ్ అమాంతం పెరిగింది. కర్నూలు మార్కెట్‌కు ఓ రైతు తెచ్చిన మిర్చికి రికార్డు రేటు దక్కింది. క్వింటా ధర ఏకంగా రూ.48,299 పలికింది. తెలంగాణలోని గద్వాల జిల్లా అలంపూర్ మండలం కోనేరు గ్రామానికి చెందిన నరసింహారెడ్డి అనే రైతు పంట మాంచి రేటుకు అమ్ముడయ్యింది. ఆయన 3.62 క్వింటాళ్ల ఎండుమిర్చిని కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు తెచ్చాడు.బ్యాడిగ రకం అవ్వడం.. సరుకు క్వాలిటీ కూడా సూపర్‌గా ఉండటంతో.. వ్యాపారులు మంచి ఆసక్తి కనబరిచారు. ఈ క్రమంలోనే క్వింటా రూ.48,299కు కొనుగోలు చేశారు. కర్నూలు మార్కెట్‌లో ఇప్పటి వరకు ఇదే హై రేటు అని అధికారులు తెలిపారు. గతేడాది మిర్చి రైతును నల్ల తామర ఇబ్బంది పెట్టింది. కనీసం పెట్టుబడి పెట్టిన సొమ్ము కూడా తిరిగి రాలేదు. దీంతో అధిక దిగుబడులు, తెగుళ్లను తట్టుకునే రకాలపై రైతులు ఫోకస్ పెట్టారు. నల్ల తామర నివారణకు ప్రత్యేక ఫోకస్ పెట్టారు. దీంతో చీడపీడల సమస్య తగ్గింది. మంచి ధర కూడా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా ధర ఇంకాస్త పెరుగుతుందేమో అని కొందరు రైతులు పంటను కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టుకుంటున్నారు. పంట తక్కువగా ఉండటంతో.. ధర మున్ముందు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

## హైదరాబాద్ లో వాల్ పోస్టర్ల కలకలం

**హైదరాబాద్**




హైదరాబాద్ లో మరోసారి బీజేపీ నేత బీఎల్ సంతోష్ పోస్టర్ల కలకలం రేపాయి. బుధవారం రాత్రి ఒకకసారిగా ఈ పోస్టర్లు పలు ప్రాంతాల్లో కనిపించాయి. "కనబడుట లేదు.." అంటూ బీఎల్ సంతోష్ ఫొటోలతో పోస్టర్లు వెలిసాయి. ఎమ్మెల్యేల కొనుగోలులో సిద్ధహస్తుడు".. అని పోస్టర్లు గుర్తుతెలియని వ్యక్తులు వేసారు. పట్టిచ్చిన వారికి బహుమానం కూడా ప్రకటించారు. బీఎల్ సంతోష్ ను పట్టిస్తే.. మోడీ హామీ ఇచ్చిన 15 లక్షల రూపాయలు.. బహుమానం అంటూ పోస్టర్లు లలో పేర్కొన్నారు. ప్రజలు బీఎల్ సంతోష్ పోస్టర్లను ఆసక్తిగా చూసారు.

## ఆలయాలను టార్గెట్ చేస్తున్న దొంగలు

**రాజమండ్రి**

తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం లో దొంగలు మూడు ఆలయాలలో హుండీ పగులకొట్టి చోరీలు చేసారు. గతంలో దొంగలు ఆగి ఉన్న లారీ బ్యాటరీలు, డీజిల్, మరియు మోటారు బైకుల దొంగతనంతోనే సరిపెట్టుకునే దొంగలు ప్రస్తుతం ట్రెండు మార్చి దేవుడి హుండీలనే పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. వివరాల్లోకెళితే తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం తాళ్లపూడి మండలం గజ్జరం అడ్డ రోడ్డు దగ్గర కనక దుర్గమ్మ గుడి మరియు గోపవరం సమీపంలో మేరీమాత విగ్రహం దగ్గర అలాగే మరో ఆలయంలో దొంగలు నగదు ఎత్తుకెళ్లారని స్థానిక ప్రజలు వాపోయారు. దేవాలయాల వద్ద సీసీ కెమెరాలు ఉన్నా దొంగలు భయపడకుండా చోరీకి పాల్పడటం భయాందోళన గురిచేస్తున్నాయని వారు వాపోయారు.

## యువతి అనుమానస్పదస్థితిలో మృతి

**మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని విద్యానగర్ లో ఒకే రూం లో అద్దెకు ఉంటున్న ట్రాన్స్ జెండర్ మహేశ్వరితో పాటు మరో అమ్మాయి అంజలి రామకృష్ణాపూర్ సమీపంలోనీ అటవీ ప్రాంతంలో గొంతుకోసుకొని ఆత్మహత్యాయత్నం చేసారు. తీవ్ర గాయాలతో ఉన్న అంజలిని మహేశ్వరి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందింది. మహేశ్వరి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. మంచిర్యాల పట్టణ పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు చేరుకొని విచారణ చేపట్టారు. అంజలి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అంజలిని గొంతుకోసి హత్య చేశారని అంజలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

## రెచ్చిపోయిన గంజా గ్యాంగ్

**రంగారెడ్డి**

రంగారెడ్డి జిల్ల రాజేంద్రనగర్ లో గంజా గ్యాంగ్ మరో సారి రెచ్చిపోయింది. బుధవారం రాత్రి రౌడీ షీటర్ సోహెల్ అనే రౌడీ షీటర్ పై కత్తులతో దాడి జరిపింది. . మోటర్ సైకిల్ పై వస్తున్న సోహెల్ అడ్డగించి కండ్లలో కారం చల్లి దాడికి పాల్పడింది. కత్తి తో మూడు చోట్ల పొడిచారు. బాధితుడు ప్రతిఘటించి తప్పించుకున్నాడు. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసాడు. హుసేన్ అనే వ్యక్తి తో పాటు ముగ్గురు పై ఫిర్యాదు చేసాడు. రాజేద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వర్మపై విహెచ్ మండిపాటు

**నిర్మల్**

డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మపై కాంగ్రెస్ సినీయర్ నేత వి హనుమంతరావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.
నాగార్జున యూనివర్సిటీలో మహిళలను కించపరిచే విధంగా డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ మాట్లాడిన తీరును మహిళలందరూ ఖండించాలి. యూనివర్సిటీ విద్యార్థుల ముందు శృంగారం లాంటి భాషతో పదజాలాన్ని ఉపయోగించిన రామ్ గోపాల్ వర్మకు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు.
రాంగోపాల్ వర్మ కామెంట్లపై మహిళా కమిషన్ స్పందించాలి. రామ్ గోపాల్ వర్మ కామెంట్లపై సుమోటోగా స్వీకరించి కేసు నమోదు చేయాలి. రాంగోపాల్ వర్మ మహిళలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని అన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎన్నికలతో రాక్షసపాలన అంతం

**విశాఖపట్నం**

ప్రజల చూపు ప్రజాస్వామ్యం వైపు అని ప్రజలు నిరూపించబోతున్నారని టిడి పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్డ్ నజీర్ అన్నారు.గెలవడం కోసం వైసిపి అరా చకాలు అన్నీ చేస్తోందని చెప్పారు. సేవా భావంతో నియమిస్తు న్నామని ఏర్పాటు చేసిన వాలంటీర్ వ్యవస్థ తో పని చేయిస్తోందని చెప్పారు.పంచా యతీ ఎలక్షన్ల నుంచి ఎమ్మెల్సీ ఎలక్షన్ల వరకూ వాలంటీర్లను బ్రోకర్లుగా వాడు కున్నారని,గ్రాడ్యుయేట్ ఎన్నికలతో రాక్షసపాలన అంతం కాబోతోందని, దొంగ ఓట్లు సృష్టించడం, డబ్బు ప్రభా వంతో గెలవాలనుకోవడం దుర్మార్గ మని అన్నారు.

# కొత్తపల్లి దారెటు...

**ఏలూరు:**

ఒకటిన్నర దశాబ్దమయింది. ఆయన చట్టసభల్లో అడుగు పెట్టి. రాజకీయ నేతకు ఇది పెద్ద సమయమే అని చెప్పుకోవాలి. ఎందుకంటే మూడు ఎన్నికల్లో వరసగా చట్టసభల్లోకి అడుగు పెట్టలేదంటే ఇక ఆ నేత రాజకీయంగా కనుమరుగయినట్లే అనుకోవవాల్సి ఉంటుంది. ఆయనే కొత్తపల్లి సుబ్బారాయుడు. ఆయన మారని పార్టీ అంటూ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఏదీ లేదు. కమ్యునిస్టు పార్టీలు మినహా అన్ని పార్టీల కండువాలను కొత్తపల్లి దాదాపు కప్పుకున్నారు. కానీ 2009 ఎన్నికల నుంచి ఆయనకు లక్ కలిసి రావడం లేదు. 2012లో గెలిచినా రెండేళ్లకే ఆయన ఎమ్మెల్యే పదవికి పరిమితమయ్యారు. 2004 వరకూ ఆయన తెలుగుదేశం పార్టీలో ఉన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో విద్యుత్తు శాఖ మంత్రిగా కూడా పనిచేశారు. ఒక రకంగా పశ్చిమగోదావరి జిల్లాను నాడు తన కనుసైగలతోనే కొత్తపల్లి శాసించాడని చెప్పాలి. జిల్లాలో ఎవరికి ఏ పదవి ఇవ్వాలన్నా కొత్తపల్లి సైగ చేస్తేనే దక్కేది. అంతగా కొత్తపల్లి సుబ్బారాయుడు హవా సాగేది. 1989లో తెలుగుదేశం పార్టీలో చేరిన కొత్తపల్లి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి పార్లమెంటు సభ్యుడిగా విజయం సాధించారు. కాపు సామాజికవర్గం నేతగా పార్టీ హైకమాండ్ కు కూడా నమ్మకంగా ఉండటంతో ఆయన మాట చెల్లుబాటు అయ్యేది. అలాంటి కొత్తపల్లి



సుబ్బారాయుడు 2009లో తీసుకున్న ఒకే ఒక నిర్ణయం ఆయన రాజకీయ జీవితాన్ని మార్చేసింది. ప్రజారాజ్యం పార్టీలో చేరడంతో అప్పటి నుంచి ఆయన పార్టీలు మారుతూనే ఉన్నారు. ప్రజారాజ్యం, కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ ఇలా నాలుగు పార్టీలు అతి కొద్దికాలంలోనే మారారు. టీడీపీలో ఆయనకు కాపు కార్పొరేషన్ పదవి అయినా దక్కింది. వైసీపీలోకి వెళితే అది కూడా దక్కలేదు. దీంతో నరసాపురాన్ని జిల్లా కేంద్రం చేయాలంటూ కొత్తపల్లి సుబ్బారాయుడు పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడ్డారు. దీంతో వైసీపీ పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. త్వరలోనే తాను ఏ పార్టీలో చెబుతానన్న కొత్తపల్లి నెలలు గడుస్తున్నా చెప్పలేకపోతున్నారు. ?కొత్తపల్లిపై నమ్మకం లేకనే ఏ పార్టీ ఆయనను చేర్చుకోలేకపోతుందన్న టాక్ వినపడుతుంది. తిరిగి కొత్తపల్లి సుబ్బారాయుడు టీడీపీకి దగ్గరవ్వాలని ప్రయత్నిస్తున్నారు. కానీ పశ్చిమ గోదావరి జిల్లా నేతలు మాత్రం ఆయన చేరికకు అంగీకరించడ లేదని తెలిసింది. అనేక మంది నేతలు కొత్తపల్లి రాకపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. నేతల నుంచి వస్తున్న వత్తిడుల దృష్ట్యా చంద్రబాబు కూడా కొత్తపల్లి చేరికకు ఇప్పటి వరకూ గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. ఇటీవల తారకరత్న భౌతికకాయాన్ని పరామర్శించేందుకు వెళ్లిన కొత్తపల్లి చంద్రబాబుని విష్ చేసినా ఆయన పట్టించుకోలేదని చెబుతున్నారు. అక్కడ రాజకీయ విషయాలు చర్చించేందుకు సరైన సమయం కాకపోయినా కొత్తపల్లికి అపాయింట్ మెంట్ కూడా ఇచ్చేందుకు చంద్రబాబు సిద్ధంగా లేరని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కొత్తపల్లి మాత్రం 2024 ఎన్నికల్లో పోటీ చేస్తానని చెబుతున్నారు. మరి ఆయనకు మిగిలింది జనసేన మాత్రమే. జనసేన కూడా ఆయనను నమ్మి టిక్కెట్ ఇస్తుందా అన్నది సందేహమే. చూడాలి మరి కొత్తపల్లి ఏ పార్టీలో చేరి పోటీ చేయనున్నారన్నది.

# బస్సు యాత్రలు... బహిరంగసభలు

### 2023 గులాబీ యాక్షన్ ప్లాన్

**హైదరాబాద్:**

మూడో సారి విజయం సాధించడానికి బీఆర్ఎస్ పార్టీ పెద్దలు ప్రచార ప్రణాళికకు తుది రూపు ఇస్తున్నారు. కేసీఆర్ బహిరంగసభలు.. కేటీఆర్ బస్సు యాత్ర ఇతర సీనియర్ నేతలకు జిల్లాల బాధ్యతలు అప్పగించాలని దాదాపుగా నిర్ణయించుకున్నారు. కేసీఆర్ జాతీయ రాజకీయాలపై దృష్టి పెట్టినా తెలంగాణ విషయంలో మాత్రం పూర్తి స్థాయిలో తానే ప్రచార బాధ్యతలు తీసుకోనున్నట్లుగా తెలుస్తోంది. ప్రతి జిల్లాలో భారీ బహిరంగ సభతో జనంలోకి రాబోతున్నారు. ఉదయం జిల్లా ప్రగతి సమావేశాలను నిర్వహించి.. సాయంత్రం భారీ బహిరంగ సభల్లో పాల్గొనేలా ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రను చేపట్టబోతున్నట్లుగా బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. ప్రతి నియోజకవర్గాన్ని కవర్ చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారని అంటున్నారు. సభలు, సమావేశాలు ఉండేలా ప్రయత్నిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేసిన అభివృద్ధిని వివరించనున్నారు. అక్కడి సమస్యలను గుర్తించి వాటిని తీర్చేందుకు కావాల్సిన హామీలను కేటీఆర్ ద్వారా ఇప్పించేందుకు సిద్ధం అయ్యారు. ప్రజలు ఏం కోరుకుంటున్నారో కూడా సర్వే రిపోర్టుల ఆధారంగా వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. ముఖ్యంగా కేటీఆర్ ఆధ్వర్యంలో జరిగే బస్సు యాత్ర విజయవంతం చేసేలా ముఖ్య అను చరులకు బాధ్యతలను అప్పగించనున్నారు. భవిష్యత్తు సీఎం కేటీఆర్ అనే తరహాలో యాత్రను నిర్వహించబోతున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో ఇప్పటికే విపక్ష పార్టీల నేతలు పాదయాత్రల ద్వారా ప్రజల్లోకి వెళ్లారు. బీజేపీ తరపున బండి సంజయ్, కాంగ్రెస్ తరపున రేవంత్ రెడ్డి, వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల పాదయాత్రలు చేశారు. చేస్తున్నారు. అందుకే ప్రభుత్వం తరపున కూడా ఓ కీలక వ్యక్తి యాత్ర చేస్తే బాగుంటుందన్న అభిప్రాయానికి వచ్చారు. బస్సు యాత్ర అయితే అన్ని నియోజకవర్గాలను చుట్టేయవచ్చు అని భావిస్తున్నారు. ఎలక్షన్ షెడ్యూల్ విడుదల అయ్యే లోపే బస్సు యాత్రను పూర్తి చేయనున్నారు. తర్వాత భారీ బహిరం గ సభలు, ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించనున్నారు. యాత్ర మాత్రం జూన్ మొదటి వారం లేదా జూన్ తర్వాత కానీ ఉండేలా నిర్ణయిస్తున్నారు. త్వరలోనే ఇందుకు సంబంధించిన పూర్తి ప్రణాళికలను విడుదల చేసే అవకాశం ఉందని తెలంగాణ భవన్ వర్గాలు చెబుతున్నాయి. ఖమ్మంలో పార్టీకి ఎమ్మెల్యేలు ఉన్నా.. అక్కడి నుంచి ప్రతి పక్షాలు గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు అధిష్టానం బావిస్తోంది. ఖమ్మంలో టిడిపి , కాంగ్రెస్, వైఎస్ ఆర్‌టిపితో పాటు పాటు సొంత పార్టీ అసమ్మతి నేతలు అధికార పార్టీని ఓడించేందుకు ప్రయత్నిస్తారన్న అభిప్రాయం అధిష్టానం మదిలో ఉంది. దీంతో ఈ జిల్లాను పూర్తిగా హరీష్ రావుకు అప్పగించి.. గెలిపించే బాధ్యతను ఇవ్వనున్నారు. గతంలో రెండు సార్లు ఒకే ఒక్క స్థానాన్ని బీఆర్ఎస్ గెల్చుకుంది. ఈ సారి ఎక్కువ సీట్లు కైవసం చేసుకునేలా హరీష్ కు బాధ్యతలివ్వనున్నారు. మొత్తంగా ఎక్కడ లోపాలు ఉన్నాయో.. పక్కాగా క్లియర్ చేసుకుంటూ బీఆర్ఎస్ ప్రచార ప్రణాళిక రెడీ చేసుకుంటున్నట్లుగా కనిపిస్తోంది.

# రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ కుటుంబం ఆదర్శం

**కమాన్ పూర్**

దుఃఖంలో కూడా సమాజ హితం కోసం కుటుంబ సభ్యుని నేత్రాలను దానం చేసి.. మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన రాజ్ ఠాకూర్ కుటుంబం ఆదర్శనీయమని సదాశయ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి. శ్రావణ్ కుమార్, సీహెచ్. లింగమూర్తి కొనియాడారు. ఈ నెల 3న పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ తమ్ముడు ఠాకూర్ శైలేందర్ సింగ్ (47) గుండె పోటుతో మృతి చెందాడు. మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించడాని, శైలేందర్ సింగ్ నేత్రాలను సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐ బ్యాంక్ కు దానం చేశారు. బుధవారం వారి నివాసంలో జరిగిన



శైలేందర్ సింగ్ సంస్మరణ సభ కార్యక్రమంలో కుటుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభినందన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్, లింగమూర్తి మాట్లాడారు. నేత్రదానం మహాదనమని అవగాహన కల్పించారు. అంధుల జీవితాల్లో వెలుగులు ప్రసాదించడానికి మరణానంతరం నేత్రదానం చేయడానికి అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యుడు ఠాకూర్ శైలేందర్ సింగ్ కోల్పోయిన దుఃఖంలో కూడా సమాజ హితం కోసం ఆయన నేత్రాలను చేయడానికి ముందుకు వచ్చిన నేత్రదాత భార్య ఠాకూర్ సరోజ్, కూతుళ్ళు తనిషా, అనేక, సోదరులు, వదినలు ఠాకూర్ అయోధ్య సింగ్, హేమలత, రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్, మనాలి, ఠాకూర్ ధర్మేంధర్ సింగ్, ఉమ, సోదరీమణులు సునీత, విమలను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు మారెల్లి రాజిరెడ్డి, రఘుపతి, అన్నపూర్ణ, జ్యోతి, తిరుమల, బైరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పోస్టర్లు హాస్యస్పదం

**హైదరాబాద్**

బిఎల్ సంతోష్ కనిపించడంలేదని పోస్టర్లు వేయడం అనేది హాస్యస్పదమని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత కార్యవాహ్ కాచం రమేష్ వ్యాఖ్యానించారు. ఆయన దేశ రాజధాని ఢిల్లీలో ఉంటారు ఆయనకు ఒక అడ్రస్ ఉంది ఇల్లు ఉందని అన్నారు.
ఆర్ఎస్ఎస్ ప్రచార్ లు వాళ్ళు జీవితం త్యాగం చేస్తారు సింప్లీసిటీ జీవితాన్ని గడుపుతారు. రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా పోస్టర్లు వేశారు. ప్రచారక్ అనే వ్యక్తి మంచి మంచి చదువులు చదివి ఏమీ ఆశించకుంగా, సంఘం కొరకు పెళ్లి చేసుకోకుండా పనీ చేస్తారుబీఎల్ సంతోష్ జీ 40 క్రితం బిటెక్ గోల్డ్ మెడలిస్ట్. అలాంటి వ్యక్తి మీద పోస్టర్లు వేయడం సరి కాదని అన్నారు.
చట్టం ఎలా నిర్ణయిస్తుందో, దాని ప్రకారం ఆర్ఎస్ఎస్ నడుచుకుంటుంది. సంతోష్ జీ దోషి అని నిర్ణయిస్తే అప్పుడు ఆర్ఎస్ఎస్ ఆలోచన చేస్తుంది. ఆయన ప్రస్తుతం బిజెపి పని మీద ఉన్నారు కాబట్టి ఆ కేసు సంబంధించి బిజెపి వాళ్ళు చూస్తారని అన్నారు.

## టీడీపీ శాసనసభ్యులు సస్పెండ్

**అమరావతి**

టీడీపీ సభ్యులు 14 మందిని శాసనసభ నుంచి గురువారం స్పీకర్ తమ్మినేని సీతారాం సస్పెండ్ చేసారు. ఈమేరకు శాసనసభా వ్యవహారాల శాఖామంత్రి ప్రతిపాదించారు. బడ్జెట్ను ప్రవేశపెడుతుండగా.. టీడీపీ సభ్యులు ఆందోళనకు దిగారు బడ్జెట్ సమావేశానికి అడ్డుపడుతున్నారంటూ వారిపై ఒక రోజుపాటు సస్పెన్షన్ వేటు వేశారు. అంతకుమునుపు.. ఆర్థిక మంత్రి బుగ్గన బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా టీడీపీ సభ్యులు వాయిదా తీర్మానాలపై చర్చించాలంటూ పట్టుపట్టారు. బుగ్గన ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేసారు. ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. ఈ క్రమంలో తెలుగుదేశం సభ్యుల తీరుపై మంత్రి బుగ్గన ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ సభ్యులు ఉద్దేశపూర్వకంగానే అసెంబ్లీని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ సంప్రదాయాలను పాటించాలంటూ కోరారు. అటు, స్పీకర్ కూడా టీడీపీ సభ్యులపై అసహనం వ్యక్తం చేశారు. అయితే టీడీపీ సభ్యులు మాత్రం తమ నిరసన కొనసాగించారు. దీంతో.. వారిని సస్పెండ్ చేయాలంటూ మంత్రి బుగ్గన సభలో ఓ ప్రతిపాదన ప్రవేశపెట్టారు. ఆర్థిక మంత్రి ప్రతిపాదనకు ఆమోదం తెలిపిన స్పీకర్ టీడీపీ సభ్యులను సభ నుంచి సస్పెండ్ చేశారు.

## పేపర్ లీక్ వెనుక బీఆర్ఎస్, బీజేపీ హస్తం

### కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్

**హైదరాబాద్**

టీఎస్ పీఎస్సీ పేపర్ లీక్ లో బీఆర్ఎస్, బీజేపీ హస్తం ఉందనే అనుమానం కలుగుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ అన్నారు. లక్షలాది మంది నిరుద్యోగుల సమస్య ను బీఆర్ఎస్, బీజేపీ లు రాజకీయ క్రీడ కు వాడుకుంటున్నాయి. కేటీఆర్ ట్వీట్ చూస్తే పేపర్ లీక్ లో బీజేపీ హస్తం ఉందని చెప్తున్నారు. మంత్రుల హస్తం ఉందని బీజేపీ ఆరోపిస్తుంది. ఇది అంతా పొలిటికల్ డ్రామా. రాజకీయాలు పక్కన పెట్టు నిరుద్యోగులకు న్యాయం చేయాలని అయనఅన్నారు.

## ఎమ్మెల్యే ఇల్లు ముట్టడికి యత్నం

**నల్గొండ**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ ఇతర పార్టీ , నాయకులపై చిరుమర్తి లింగయ్య అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు బీజేపీ శ్రేణులు మండిపడ్డాయి. గురువారం నాడు నార్కట్ పల్లి మండలంలో బీజేపీ నాయకులు ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఇంటి ముట్టడికి ప్రయత్నించారు. వంద మంది బీజేపీ నాయకులు ర్యాలీ గా బయలుదేరి ముట్టడికి వెళ్లారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఘటనలో పలువురికి గాయాలు అయ్యాయి

## టీఎస్పీఎస్సీ చైర్మన్ రాజీనామా చేయాలి

**మహబూబాబాద్**

టీఎస్పీఎస్సీ నియామక పరీక్ష పత్రాలు లీకేజీ పై సిట్టింగ్ జరిగితో విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని, అదేవిధంగా చైర్మన్ జనార్ధన్ రెడ్డి రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కోర్ట్ ఆవరణ ముందు దు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సింహాద్రి,పట్టణ నాయకులు ఉపేందర్, రాకేష్,నితిన్,వినోద్, దుద్దేల నవీన్,బబ్బులు,అఖిల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు

## మెదక్ లో భారీ వర్షం

**మెదక్**

ఉమ్మడి మెదక్ జిల్లాలో వర్షం పడింది. గత వారం రోజులుగా ఎండలతో వేసవి తాపాన్ని చూపించిన వరుణుడు ఒక్కసారిగా చల్లాబడ్డాడు. సంగారెడ్డి జిల్లా లోని వివిధ ప్రాంతాల్లో ఈదురు గాలులు వడగళ్ళ వర్షం కురిసింది. జహీరాబాద్ పట్టణంతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడగా కోహిర్ మండలం బడంపేట, సంగారెడ్డి పలు చోట్ల వడగళ్ల వానకోహిర్ (మం) బడంపేట్ లో పడుతున్న వడగళ్ళు పడింది.

# ఏటీఎం బిర్యానీలు

**చెన్నై:**



చెన్నైలో ఉందీ బిర్యానీ ఏటీఎం. చెన్నైలో బిర్యానీకి ప్రఖ్యాతి గాంచిన 'బాల్ వీటు కళ్యాణం బిర్యానీ' లేదా సింపుల్ గా 'బీవీకే బిర్యానీ' హోటల్ లో ఈ బిర్యానీ ఏటీఎం ఉంది. ఇప్పటికే చెన్నై నగరంలో ఎక్కడికైనా 60 నిమిషాల్లో బిర్యానీని హోం డెలివరీ చేస్తూ బీవీకే బిర్యానీ ఫేమస్ అయింది. వారి బిర్యానీ టేస్ట్ కూడా అద్భుతంగా ఉంటుందని రివ్యూస్ చెబుతున్నాయి. కూడా సాధారణ ఏటీఎం మెషిన్ మాదిరిగానే ఉంటుంది. కానీ స్క్రీన్ సైజ్ పెద్దదిగా ఉంటుంది. 32 అంగుళాల స్క్రీన్ ను ఈ సర్వీస్ కోసం ఏర్పాటు చేశారు. ఈ స్క్రీన్ పై ఆ హోటల్ లో లభించే బిర్యానీల మెన్యూ డిస్ ప్లే అయి ఉంటుంది. మీరు అందులో మీకు కావాల్సినవి సెలక్ట్ చేసుకోవాలి. ఆ తరువాత డెబిట్, క్రెడిట్, యూపీఐ, లేదా క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా బిల్ పే చేయాలి. కొన్ని నిమిషాల్లోనే మీరు కోరుకున్న బిర్యానీ నీట్ గా ప్యాక్ అయి మీ ముందుకు వస్తుంది. బిర్యానీ రెడీ కాగానే మీకు స్క్రీన్ పై ప్రాంప్టింగ్ వస్తుంది. అక్కడ ఓపెన్ డోర్ ఆప్షన్ ను క్లిక్ చేయగానే, డోర్ ఓపెన్ అవుతుంది. బిర్యానీ ప్యాకెట్ మీ ముందు ఉంటుంది. త్వరలో మరిన్ని బ్రాంచ్ ల్లోనూ ఈ సర్వీసును ప్రారంభించాలని 'బీవీకే బిర్యానీ' ఆలోచిస్తోంది. అంతేకాదు, ఇతర నగరాల్లోనూ తమ బిర్యానీ సెంటర్ లను ప్రారంభించే యోచనలో ఉంది. బీవీకే బిర్యానీని 2020లో ప్రారంభించారు. ఇక్కడ బిర్యానీ వండేందుకు ఉపయోగించే ప్రతీ దినుసునూ ప్రత్యేకంగా ఎంపిక చేసి తీసుకుంటామని యాజమాన్యం చెబుతోంది. మసాలా దినుసులను ఏ రోజుకు ఆ రోజు తామే స్వయంగా తయారు చేస్తామని, తాజా చికెన్ లేదా మటన్ ను మాత్రమే వాడుతామని వివరించారు. ముఖ్యంగా గ్యాస్ స్టవ్ లపై కాకుండా, సంప్రదాయంగా కట్టెల పొయ్యిపై బిర్యానీ తయారు చేస్తామని తెలిపారు.

# ఎమ్మెల్యే ఎమ్మెల్సీపై గురి...

**విజయవాడ:**

ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు ఉత్కంఠ రేపుతున్నాయి. ఇద్దరు వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యేలు నేరుగా పార్టీని ధిక్కరించారు. ఆత్మప్రబోధానుసారం ఓటు వేస్తానని వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రకటించారు. అదే సమయంలో తమతో కొంత మంది వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని మాజీ డిప్యూటీ సీఎం చినరాజప్ప ప్రకటించారు. టీడీపీ తరపున అనూరాధ నామినేషన్ వేశారు. అందుకే ఇప్పుడు ఎన్నిక ఉత్కంఠగా మారింది. ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్యే కోటా ఏడు స్థానాలకు ఈ నెల 23న మళ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఏడు స్థానాలకు వైసీపీ అభ్యర్థులు ఇప్పటికే నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ కూడా తన అభ్యర్థిని రంగంలోకి దింపింది. టీడీపీ తరపున పంచుమర్తి అనురాధ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలోకి దిగారు. వైసీపీ అసమ్మతి ఎమ్మెల్యేలు తమకు ఓటేస్తారనే నమ్మకంతోనే అనురాధను రంగంలోకి టీడీపీ దించినట్టు తెలుస్తోంది. తమ పార్టీ తరపున గెలిచిన ఎమ్మెల్యేలు తమ అభ్యర్థి ఓటు వేయాల్సిందేనని టీడీపీ నేత చినరాజప్ప అన్నారు. వైసీపీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని ప్రకటించారు. దీంతో వైఎస్ఆర్ సీపీ నేతలు అప్రమత్తమయ్యారు. అసెంబ్లీలో మొత్తం 175 మంది సభ్యులు ఉన్నారు. ఏడు స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి కాబట్టి ఒక్కొక్కరికి 25 ఓట్లు తెచ్చుకోవాల్సి ఉంటుంది. అలా కాకపోయినా ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తే వారికి గెలుపు లభిస్తుంది. వైఎస్ఆర్‌సీపీకి 151 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. ఏడుగురు అభ్యర్థులకు ఓట్లను సమానంగా పంచితే ఒక్కొక్కరికి 21 ఓట్లు లభిస్తాయి. మరో నలుగురు అభ్యర్థులకు మరో ఓటు అదనంగా వేయించవచ్చు. అంటే నలుగురికి 22 ఓట్లు, ముగ్గురుకు ఇరవై ఒక్క ఓట్లు పంచుతుంది. ఇక తెలుగుదేశం పార్టీకి అధికారికంగా 23 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. అంటే... వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల కన్నా టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థికే ఎక్కువ ఓట్లు ఉన్నట్లు లెక్క. కానీ ఆ పార్టీకి ఉన్న సమస్య నలుగురు ఎమ్మెల్యేలు ధిక్కరించడం. టీడీపీ, జనసేన రెబల్స్ ఓట్లు కీలకం అయ్యాయి. టీడీపీ తరపున గెలిచిన మద్దాలి గిరి, కరణం బలరాం, వాసుపల్లి గణేష్, వల్లభనేని వంశీ వైసీపీకి అనధికారికంగా మద్దతు పలికారు. అలాగే జనసేన నుంచి గెలిచిన రాపాక వరప్రసాద్ కూడా వైసీపీకే మద్దతుగా నిలిచారు. కానీ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీలు విప్ జారీ చేస్తాయి. వీరు పార్టీ విప్ ను ఉల్లంఘిస్తే అనర్హతా వేటు వేయమని పార్టీలు ఫిర్యాదు చేస్తాయి. అదే జరిగితే వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. పైగా తమది నైతిక రాజకీయాలని.. వైసీపీ ప్రకటిస్తూ ఉంటుంది. అందుకే వారికి ఇంకా అధికారికంగా పార్టీ జెండా కప్పలేదు. ఇప్పుడు వారితో ఓటు వేయించుకోవాల్సి ఉంటుంది. ఓటు వేస్తే వారిపై అనర్హతా వేటు వేయాల్సి వస్తుంది. వీరు గైర్హాజర్ అవడానికి కూడా అవకాశం ఉంది. అదే జరిగితే.. టీడీపీకి నాలుగు ఓట్లు తగ్గిపోతాయి. 19 మంది ఎమ్మెల్యేల ఓట్లే ఉంటాయి. అప్పుడు వైసీపీకి అన్ని ఎమ్మెల్సీ సీట్లు లభిస్తాయి. వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలు ఇప్పుడు కీలకం. కోటంరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి ఇద్దరూ పార్టీని ధిక్కరించారు. వారి ఓట్లు ఎవరికి వేస్తారన్నది ఇప్పుడు ఉత్కంఠగా మారింది. ఆత్మ ప్రబోధానుసారం ఓట్లు వేస్తామని ఎమ్మెల్యేలు చెబుతున్నారు. టీడీపీ అభ్యర్థికి ఓట్లు వేస్తే... వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో ఇద్దరికి చెరో ఓటు తగ్గుతుంది. టీడీపీ అభ్యర్థికి రెండు ఓట్లు పెరుగుతాయి. అప్పుడు టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అనూరాధ విజయం సాధిస్తారు. వీరు కాకుండా మరో ఒకరిద్దరు సైలెంట్‌గా టీడీపీ అభ్యర్థికి ఓటు వేసినా.. వైఎస్ఆర్‌సీపీకి షాక్ తగులుతుంది. సరే ఇప్పటి వరకూ చెప్పిన రాజకీయ నీతి వాక్యాలన్నీ పక్కన పెట్టి.. టీడీపీ, జనసేన రెబల్స్ ఐదుగురితో తమకు అనుకూలంగా ఓటు వేయించుకుంటే.. వైఎస్ఆర్‌సీపీ సేఫ్‌గా ఉంటుంది. అందుకే ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికలు ఉత్కంఠ రేపుతున్నాయి. ఈ ఎన్నికను అధికార వైసీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మొత్తం ఏడు స్థానాలు గెలిచి తీరాల్సిందేనని కేబినెట్ సమావేశంలో మంత్రులకు సీఎం జగన్ స్పష్టంగా చెప్పినట్టు తెలుస్తోంది. ఏ మాత్రం తేడా వచ్చినా ఊరుకునేది లేదని సీఎం హెచ్చరించినట్టు ప్రచారం జరుగుతోంది. మంత్రివర్గంలో మార్పులు తప్పవని ఈ సందర్భంగా సీఎం జగన్ చెప్పినట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ చేసినా.. ఓటింగ్‌కు దూరంగా ఉన్నా ఫలితం తారుమారయ్యే అవకాశాలు ఉన్నాయి. అందుకే వైసీపీ టెన్షన్ పడుతుంది.

# బోరున ఏడ్చేసిన రాజయ్య

**వరంగల్**



బీఆర్ఎస్ ఎమ్మెల్యే రాజయ్య వెక్కివెక్కి ఏడ్చారు. దీనికి కారణం ఆయన ఇటీవల లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కోవడమే. కరుణాపురంలో జరిగిన ఫాదర్ కొలంబో జన్మదిన వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడుతూ.. తనపై కొందరు నీచ రాజకీయాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాజకీయంగా ఎదుర్కొలేకే తనపై లైంగిక ఆరోపణలు చేస్తున్నారని భావోద్వేగానికి గురయ్యారు. 63 ఏళ్ల వయసున్న తనపై ఇలాంటి ఆరోపణలు చేయడం ఏంటని ప్రశ్నించారు. దమ్ముంటే ఫేస్ టూ ఫేస్ రాజకీయాలు చేయాలని.. తాడోపేడో తెలుసుకుందామని ఎమ్మెల్యే సవాలు విసిరారు. అయితే ఏ సర్వే చూసిన తాను ముందు వరుసలో ఉన్నానని, తనను నిజాయితీగా ఎదుర్కోలేక కొందరు శవ రాజకీయాలు చేస్తూ ఇబ్బంది పెడుతున్నారని కన్నీటిపర్యంతమయ్యారు. ఎవరెన్ని ఇబ్బందులు పెట్టిన ఫాదర్ కొలంబో ఆశిస్సులతో ఐదోసారి ఎమ్మెల్యేగా గెలుస్తానని స్పష్టం చేశారు. ఎంతో ఆత్మీయంగా తాను మమత అనురాగాలు పంచిపెడుతూ మహిళల గౌరవాన్ని పెంచే విధంగా మగవారితో సమానంగా రాణించాలని ప్రోత్సహిస్తున్నానని, వాటిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలతోపాటు స్వపక్ష నాయకులు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా.. ఎవరు ఏం చేసినా భయపడే ప్రసక్తి లేదన్నారు. తాను మత కన్నెల చేతుల్లో, వారి ఒళ్లో పెరిగినవాణ్ణి అని, ఆడవాళ్ళను గౌరవించే వ్యక్తినని తెలిపారు. చివరి ఊపిరి ఉన్నంతవరకు ఘనపూర్ నియోజకవర్గమే నా దేవాలయం, ప్రజలే నాకు దేవుళ్ళని చెప్పారు. ప్రజల మధ్యనే ఉంటా ప్రజల మధ్యనే చస్తానని కొలంబో విగ్రహం సాక్షిగా రాజయ్య శపథం చేశారు. ఇటీవల మహిళా సర్పంచ్ నవ్యపై ఎమ్మెల్యే లైంగిక వేధింపులకు పాల్పడినట్లుగా ఆరోపణలు వచ్చాయి. జానకిపురం సర్పంచ్ నవ్య ఈ ఆరోపణలు చేశారు. అధిష్ఠానం ఆదేశాలతో ఆరోపణలు చేసిన సర్పంచ్ నవ్య ఇంటికి వెళ్లి రాజయ్య సర్దిచెప్పారు. ఇటీవల జరిగిన పరిణామాలకు చింతిస్తున్నానని తెలిపారు. తనకు నలుగురు చెల్లెళ్లు ఉన్నారని, మహిళల ఆత్మగౌరవం కోసమే తాను పనిచేస్తున్నానని చెప్పుకొచ్చారు. ప్రాణం ఉన్నంత వరకు మహిళలకు సహకారం అందిస్తానన్నారు. ఇటీవల జరిగిన కొన్ని పొరపాట్లకుక్షమాపణలు చెబుతున్నానన్నారు. అభివృద్ధి విషయంలోనే నాపై ఆరోపణలు వచ్చాయన్నారు. జానకీపురం అభివృద్ధికి రూ.25 లక్షలు మంజూరు చేస్తున్నానని చెప్పారు. సర్పంచ్ నవ్య ప్రవీణ్ కుమార్ లను కాపాడుకుంటానన్నారు. పార్టీ అధిష్టానం కూడా జానకీపురం గ్రామం అభివృద్ధి చేయాలని ఆదేశించిందన్నారు. ప్రవీణ్ ను చూసే సర్పంచ్ కు టికెట్ ఇచ్చానని, నవ్యను చూసి కాదన్నారు. స్టేషన్ ఘనపూర్ లో ఏం జరుగుతుందో అందరికీ తెలుసన్నారు.

# సింగరేణి నుంచి ఏఈ పరీక్షల వరకు..

**హైదరాబాద్:**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పటి ప్రతి పరీక్షలో టీఎస్‌పీఎస్సీ వివాదాలు ఎదుర్కొంటున్నది. రహస్యంగా ఉండాల్సిన పరీక్షా పత్రాలు ముందుగానే లీక్ అవుతున్నాయి. ఇలాంటి సందర్భాలు ఒకటి, రెండు సార్లు కాదు.. వరుసగా చోటుచేసుకుంటున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికలు ముందు గ్రూప్?2 పరీక్షల్లో పెద్ద వివాదం నడించింది. నిబంధనలకు విరుద్ధంగా వైట్‌నర్ ఉపయోగించిన అభ్యర్థుల పేపర్లను కమిషన్ వాల్యూయేషన్ చేసింది. దీనిపై కొందరు కోర్టుకు వెళ్లడంతో ఫలితాల ప్రకటనలో జాప్యం ఏర్పడింది. ఇక సర్వీస్ కమిషన్ నిర్వహించిన ప్రతీ పరీక్షలో న్యాయపరమైన చిక్కులు ఎదురైనా వాటిని కోర్టులో టీఎస్పీఎస్సీ సమర్ధవంతంగా ఎదుర్కోలేకపోయిందనే ఆరోపణలు వచ్చాయి2015లో సింగరేణిలో 450 జూనియర్ అసిస్టెంట్ గ్రేడ్?2 ఉద్యోగాల నియామకాలు చేపట్టారు. అందులో భాగంగా నిర్వహించిన పరీక్షల్లో పెద్ద ఎత్తున గందరగోళం జరిగిందని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. పైరవీలు ఉన్న వారికే పోస్టులు దక్కాయని ప్రచారం జరిగింది. బీఆర్ఎస్ లోకల్ లీడర్లు, సింగరేణి పెద్ద ఆఫీసర్లు కుమ్మక్కై ఒక్కో పోస్టును రూ.10 లక్షలకు అమ్మకున్నారనే ఆరోపణలు పెద్ద ఎత్తున వచ్చాయి. ఒకే కుటుంబంలో ముగ్గురు, నలుగురికి ఉద్యోగాలు వచ్చాయంటూ ప్రచారం జరిగింది. గతేడాది సెప్టెంబరు 4న జూనియర్ అసిస్టెంట్ గ్రేడ్?2 ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించిన పరీక్ష సైతం వివాదాస్పదమైంది. పరీక్ష జరిగిన రోజే క్వశ్చన్ పేపర్‌ను లీక్ చేసి గోవాలో ఎగ్జామ్ రాయించినట్టు వార్తలు వచ్చాయి. ప్రైమరీ 'కీ'లో తప్పులు దొర్లాయని దాదాపు 3వేల అభ్యంతరాలు వచ్చినా సింగరేణి సంస్థ పట్టించుకోలేదు. కానీ ఫైనల్ రిజల్ట్‌లో మాత్రం అందరికీ మూడు మార్కులు కలిపింది. పరీక్షకు అర్హత సాధించిన అభ్యర్థుల వివరాలను ఆన్‌లైన్ తప్పుల తడకగా పెట్టారు. దీనిపై అప్పట్లో విమర్శలు వచ్చినా ప్రభుత్వం పట్టించుకోకుండా సైలెంట్‌గా ఉండిపోయింది. గతేడాది జూలైలో సదరన్ విద్యుత్ సంస్థలో జూనియర్ లైన్‌మెన్ల ఎంపిక కోసం పరీక్షలు నిర్వహించారు. పరీక్షా సమయంలో ఓ అభ్యర్థి సెల్‌ఫోన్‌తో ఎగ్జామ్ సెంటర్‌లోకి వచ్చాడు. దీన్ని గమనించిన సెంటర్ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేస్తే అసలు విషయం బయటపడింది. ఎగ్జామ్‌కు వెళ్లే ముందు జవాబులు చెబుతానని డబ్బులు తీసుకున్నారని, అందుకే సెల్‌ఫోన్ తీసుకొచ్చాని సదరు అభ్యర్థి వివరించాడు. దీనిపై విచారణ చేస్తున్న సమయంలో మరో అభ్యర్థి అంబర్‌పేట పోలీసులను ఆశ్రయించాడు. పరీక్ష సెంటర్ లోపలకి వెళ్లే ముందు ఫోన్ చేసి జవాబులు చెపుతామని డబ్బులు తీసుకుని తనను మోసం చేశారని ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎంక్వైరీ చేసిన పోలీసులు ఎగ్జామ్స్‌కు ముందే క్వశ్చన్ పేపర్ లీకైందని గుర్తించారు. విద్యుత్ సంస్థలో పనిచేసే ఐదుగురు ఉద్యోగులు ఎగ్జామ్ సెంటర్‌కు వెళ్లే ముందు అభ్యర్థులకు సెల్ ఫోన్ ద్వారా జవాబు చెపుతామని హామీ ఇచ్చారని, అందుకు ఒక్కోక్కరి వద్ద రూ.5 లక్షలకు ఒప్పందం కుదుర్చుకుని తేలింది. ఇలా 181 మంది అభ్యర్థుల వద్ద డబ్బులు వసూలు చేశారని, ఒకేసారి అందరికి ఫోన్‌లో జవాబులు చెప్పేందుకు సమయం సరిపోకపోవడంతో ఓ అభ్యర్థి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అసలు విషయం బయటకు వచ్చింది. దీంతో అధికారులు ఆ పరీక్షను రద్దు చేశారు. చివరికి ప్రభుత్వ విభాగమైన సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్‌తో వివాదం నడించింది. సర్వీస్ కమిషన్‌కు కావాల్సిన విధంగా సాఫ్ట్‌వేర్ అందించట్లేదని అప్పటి సర్వీస్ కమిషన్ బోర్డు అసంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు ఉద్యోగాల భర్తీ ప్రక్రియ అప్పగించలా? వద్దా? అని అప్పట్లో ప్రభుత్వ వర్గాల్లో చర్చ జరిగింది. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో పరీక్షల నిర్వహణ అత్యంత పారదర్శకంగా జరుగుతున్నదని ఆ సంస్థ అధికారులు పదే పదే చెబుతుంటారు. కానీ తాజాగా మార్చి 5న నిర్వహించిన ఏఈ పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రం లీక్ అయిందని ఫిర్యాదు రావడంతో ఎంక్వయిరీ చేయగా సెక్రటరీ పెషీ నుంచే పేపర్ లీక్ అయినట్టు గుర్తించారు. అనుమానంతో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్స్ పరీక్షలు, వెంటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పరీక్షలను సైతం టీఎస్పీఎస్సీ అధికారులు వాయిదా వేశారు. ఏఈ పరీక్ష రద్దుచేశారు. అలాగే గ్రూప్?1 పరీక్ష పేపర్ కూడా లీకైందనే అనుమానులు ఉన్నాయి. పేపర్ లీక్ లో కీలక వ్యక్తిగా ఉన్న ప్రవీణ్ కూడా గ్రూప్ 1 పరీక్ష రాశాడు. అందులో అతడికి 103 మార్కులు వచ్చాయి. దీంతో ముందుగానే అతనికి ప్రశ్నలు తెలుసని, పరీక్షను రద్దు చేయాలని అభ్యర్థులు అందోళన చేస్తున్నారు. పోలీసు ఉద్యోగం కోసం ఐదు ఈవెంట్స్ ఉండగా ప్రస్తుతం వాటిని మూడుకు కుదించారు. చాలా కాలం తర్వాత పోలీసు ఉద్యోగాల భర్తీ చేస్తుండటంతో వయస్సు పరిమితిని పెంచాలని అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. చివరికి పరిమితిని 3 ఏండ్లు సడలించారు. ప్రిలిమ్స్ పరీక్షలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించలేదు. దీనిపై అభ్యర్థులు ఆందోళనలు చేయగా చివరికి పాటించారు. ఎస్సై, కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షలో దాదాపు 20 కి పైగా తప్పుడు ప్రశ్నలు ఇచ్చారని (రెండు పరీక్షల్లో కలిపి) అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. అభ్యర్థులకు అనుకూలంగా కోర్టు తీర్పు రావడంతో చివరకు బోర్డు మార్కులు కలిపింది. ఈవెంట్స్ సమయంలోనూ వివాదాలు తలెత్తాయి. గతంలో 3.4 మీటర్లు ఉన్న లాంగ్ జంప్‌ను ఏకంగా 4 మీటర్లకు పెంచారు. ఇక ప్రెగ్నెంట్, డెలివరీ అయిన మహిళా అభ్యర్థులు కోర్టుకు వెళితే.. మెయిన్ ఎగ్జామ్ తర్వాత వారికి ఈవెంట్స్ నిర్వహించాలని కోర్టు బోర్డుకు ఆదేశాలు జారీ చేసింది.

# గార్ల్స్ హాస్టల్ లో పాములు, ఎలుకలు

**వరంగల్:**

దేశానికి, ప్రపంచానికి ఎంతోమంది మేధావులను అందించిన వరంగల్ కాకతీయ యూనివర్సిటీ హాస్టల్స్ దుస్థితి అధ్వాన్నంగా మారింది. ఎలుకలు ఏకంగా హాస్టల్ గదుల్లోకి ప్రవేశించి విద్యార్థులను కొరికి గాయాలపాలు చేస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం పద్మాక్షి గర్ల్స్ హాస్టల్ ఆ బ్లాక్‌లో వెంటిలేటర్స్ నుంచి హాస్టల్ గదిలోకి ప్రవేశించిన ఎలుకలు ముగ్గురు విద్యార్థుల కాళ్ళు, చేతులు కొరికాయి. చెత్తాచెదారంతో పాటు ఆహార పదార్థాలు పోగవడంతో ఎలుకలు, తేళ్లు, పాములు హాస్టళ్ల ఆవరణలో తిష్ట వేశాయి. యూనివర్సిటీ క్యాంపస్‌లో పద్మాక్షి గర్ల్స్ హాస్టల్ తో పాటు,న్యూ పీజీ హాస్టల్, పోతన, గణపతిదేవా, అంబేద్కర్, జగ్ జీవన్ ఫార్మసీ హాస్టల్ తో కలిపి ఎనిమిది హాస్టళ్లు ఉన్నాయి.. ఇందులో మూడు వేల మందికి పైగా విద్యార్థులు ఉంటున్నారు. ఎలుకల బెడదతో ప్రశాంతంగా పడుకోలేకపోతున్నారు విద్యార్థులువిషపు పురుగులు, కుక్కల బెడద కూడా ఉందని గర్ల్స్ హాస్టల్ విద్యార్థులు వాపోతున్నారు. బాయ్స్ హాస్టళ్లలో కూడా ఇదే దుస్థితి నెలకొంది. ఈ పరిస్థితులపై ఎన్నిసార్లు కంప్లయింట్ చేసినా వర్సిటీ అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. విద్యార్థుల ప్రాణాలకు భద్రత కల్పించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఎలుకలు, విషపు పురుగుల స్వైర విహారంతో హాస్టల్ విద్యార్థుల బతుకు దినదినగండంలా మారింది. ప్రాణాలు పణంగా పెట్టి చదువుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. చదువుకుందామని వచ్చినవాళ్లను ఎలుకలు కొరుకుతున్నాయి. రాత్రిళ్లు పాములు భయపెడుతున్నాయి. ఇక రాత్రీపగలు తేడా లేకుండా కుక్కలు హడలెత్తిస్తున్నాయి. దేశానికి, ప్రపంచానికి మేధావులను అందించిన ఓరుగల్లు కాకతీయ వర్సిటీ హాస్టళ్లలో ఇప్పుడు హాహాకారాలు వినిపిస్తున్నాయి.

# కలగానే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు

**హైదరాబాద్:**

2014 ఎన్నికల్లో టీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తే ఇప్పటి వరకు అమలు చేయకపోవడంపై పేదలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సొంతింటి స్థలం కలిగిన కుటుంబాల నిర్మాణానికి అయ్యే రూ.3లక్షల ఖర్చును భరిస్తామని చెబుతూ ప్రచారం చేస్తున్నది. జిల్లాలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూమ్?ఇండ్ల పంపిణీ ఇక కలగానే మిగులిపోతుంది. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ఇచ్చిన అత్యంత ప్రధానమైన హామీ డబూల్?బెడ్?రూం ఇండ్లు. ఈ ఇండ్ల పంపిణీలో నిర్లక్ష్యం జరగడంతో ప్రజల్లో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చే అవకాశం లేకపోలేదు. ఈ విమర్శలను తొలగించేందుకు పూర్తైన డబుల్ ?బెడ్?రూం ఇండ్లు పంపిణీ చేస్తారా లేదా అనే అనుమానాలున్నాయి. రంగారెడ్డి జిల్లాలో 6,637 ఇండ్లు మంజూరు కాగా 6,175 ఇండ్లకే టెండర్లు పిలిచారు. పూర్తిస్థాయిలో టెండర్లను పిలవకపోవడం.. నిర్మాణం చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో డబుల్? బెడ్?రూం ఇండ్ల నిర్మాణం గందరగోళంగా మారింది. ఎంతగా ఆశపడిన నిరుపేదల ఇంటి కల కలగానే మారిపోయింది. రంగారెడ్డి జిల్లాలో 2,836 ఇండ్లకు టెండర్లు ఖరారైతే.. కేవలం 2061 ఇండ్లను మాత్రమే నిర్మాణాలు పూర్తి చేశారు. ఈ ఇండ్లు పూర్తై యేండ్లు గడుస్తున్న ఇప్పటికి పంపిణీ చేయకపోవడంతో దుమ్ముతో పాటు నాసిరకం పనులతో కొన్ని ఇండ్లు పెచ్చులూడుతున్నాయి. పూర్తిగా ఆ ఇండ్లన్నీ కంపచెట్లతో కూరుకుపోయాయి. ఈ కలను ఎప్పుడు నిజం చేస్తారో వేచిచూడాల్సిందే. జిల్లాలో డబూల్?బెడ్?రూం ఇండ్ల కోసం వస్తున్న దరఖాస్తుల సంఖ్య వేలలో ఉంది. ఇప్పటి వరకు 97,623 దరఖాస్తులు వచ్చాయి. నియోజకవర్గాల వారీగా చూస్తే.. చేవెళ్ల నియోజకవర్గంలో 7,778, కల్వకుర్తిలో 3,038, ఇబ్రహీంపట్నంలో 12,904, మహేశ్వరంలో 11,484, రాజేంద్రనగర్‌లో 58,767, షాద్‌నగర్‌లో 3,652 ఉన్నాయి. ఎనిమిదేళ్లుగా దరఖాస్తులు స్వీకరిస్తూనే ఉన్నారు. మొదట స్వీకరించిన దరఖాస్తుల జాడలేకపోగా గతేడాది మీ సేవ ద్వారా 9,704 దరఖాస్తులు రాగా వాటిని తహసీల్దారు పరిశీలించారు. 3,400 దరఖాస్తులు అర్హులుగా గుర్తించారు. 6,496 దరఖాస్తులు అనర్హులుగా గుర్తించారు. ఆశించిన మేరకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం జరగకపోవడంతో ప్రభుత్వం ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తగ్గించేందుకు కొత్త ఆలోచన చేసినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. సొంతంగా స్థలం ఉన్నవారికి రూ.3లక్షలు ఇంటి నిర్మాణం కోసం మంజూరు చేయాలని నిర్ణయించింది

## బ్రిడ్జి నిర్మాణ సమస్యలను పరిష్కరించాలి

**వికారాబాద్**

బ్రిడ్జి నిర్మాణంలో వస్తున్న సమస్యలను పరిష్కరిస్తూ రోడ్డు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులకు జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సూచించారు. బ్రిడ్జి రోడ్డు నిర్మాణ పనులకు గాను ఇప్పటికే 12 కోట్ల రూపాయలు మంజూరు అయినప్పటికీ పనుల జాప్యంపై తెలుసుకునేందుకు వీలుగా ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో కలియతిరిగారు. పనులు చేపట్టేందుకు వీలుగా బ్రిడ్జికి సమీపంలో ఉన్న క్రిస్టియన్ సంస్థ ప్రతినిధులు అదేవిధంగా అక్కడ నివాసముంటున్న ప్రజలతో సమావేశం నిర్వహించి సమస్య పరిష్కార దిశగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు, రవాణాకు ఇబ్బందికరంగా ఉన్న బ్రిడ్జి రోడ్డు పనులను చేపట్టేందుకు వీలుగా కృషి చేయవలసిన అవసరం ఉందని కలెక్టర్ అన్నారు.

కలెక్టర్ తో పాటు వికారాబాద్ ఆర్ డి ఓ విజయ కుమారి, తహసిల్దార్ వాహిదా ఖాతున్, ఆర్ అండ్ బి డీఈ శ్రీధర్ రెడ్డి, రెవెన్యూ ఇంజనీరింగ్ విభాగాల అధికారులు ఉన్నారు

## ఇంటర్ విద్యార్థులకు గాయాలు.

**ఉండ్రాజవరం**



ఇంటర్ విద్యార్థులు ప్రయాణిస్తున్న వేలివెన్ను విద్యాసంస్థలు కు చెందిన కాలేజీ బస్సు లారీ ఢీకోనడంతో ప్రమాదం జరిగింది. వేలివెన్ను శశి విద్యాసంస్థల ఇంటర్ విద్యార్థులు తణుకు లో పరీక్షలు వ్రాసి తిరిగి వస్తుండగా మునిపల్లి వద్ద ఎదురుగా వస్తున్న లారీని డీ కొనడంతో ప్రమాదం సంభవించినట్లు స్థానికులు చెబుతున్నారు. గాయపడిన విద్యార్థులకు విద్యాసంస్థల యాజమాన్యం గోప్యంగా చికిత్సను అందించడం వలన గాయపడిన విద్యార్థులు వివరాలు తెలియాల్సి ఉంది.

## ఒక్కసారిగా మారిపోయిన వాతావరణం

**హైదరాబాద్**

హైదరాబాద్ నగరంలో వాతావరణం గురువారం మద్యాహ్నం ఒక్కసారిగా మారిపోయింది. మబ్బులతో కమ్ముకున్న నగరంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఆకాశంలో మేఘాలు కమ్ముకోవడంతో మిట్ట మధ్యాహ్నమే చీకటి పడింది. దాంతో వాహనాలకు హెడ్ లైట్స్ వేసుకుని వాహనదారులు నడుపుతున్నారు.నాంపల్లి, అబిడ్స్, కోఠి, బషీర్బాగ్,ఖైరతాబాద్, అఫ్జల్ గంజ్,గోషామహల్ ,మంగలహాట్,మల్లెపల్లి,తదితర ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది.

## వీధి వ్యాపారుల షెడ్లను వెంటనే ప్రారంభించాలి

**జగిత్యాల,**



వీధి వ్యాపారుల కోసం గొల్లపల్లి రోడ్డులో నిర్మించిన షెడ్లను వెంటనే ప్రారంభించి, వీధి వ్యాపారులకు అప్పగించాలని కోరుతూ మాజీ మున్సిపల్ చైర్పర్సన్ బిజెపి నాయకురాలు డాక్టర్ భోగ శ్రావణి గురువారం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు.ఈసందర్భంగా శ్రావణి మాట్లాడుతూ రహదారుల వెడల్పు, వీధి వ్యాపారుల క్రమబద్ధీకరణలో భాగంగా పట్టణ ప్రగతి నిధులను వెచ్చించి పాత బస్టాండ్ నుండి గొల్లపల్లి రోడ్డులో వీది వ్యాపారుల కోసం కేటాయించే 37 షెడ్ల నిర్మాణం పూర్తి అయినప్పటికీ కొన్ని రాజకీయ కారణాలవల్ల ఆ షెడ్ల ను ప్రారంభించకుండా తాత్సారం చేస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా పట్టణ ప్రగతి మరియు మెప్మా నిధుల ద్వారా నిర్మించవలసి ఉన్న మిగతా 23 షెడ్ల నిర్మాణాన్ని కూడా వెంటనే ప్రారంభించాలని కోరారు.ఇప్పటికే నిర్మాణం పూర్తి అయిన షెడ్ల ను వీధి వ్యాపారులకు అప్పగించేలా ఆదేశాలు జారీ చేసి పట్టణం లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారంతోపాటు వీధి వ్యాపారులకు చేయూతనివ్వాలని వినతి పత్రం లో కోరారు.

## కేంద్ర ప్రభుత్వం తన తీరు మార్చు కోవాలి

## విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

**విశాఖపట్నం**

ఉక్కు పరిశ్రమ ప్రైవేటీక రణంకు వ్యతిరేకంగా స్టీల్ ప్లాంట్ ప్రధాన గేటు వద్ద ఉక్కు ఉద్యోగుల ఆందోళ న కోనసాగుతున్నా కేంద్రం మాత్రం వెనుక అడుగువేయడం లేదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ అన్నారు.విశాఖ ఉక్కు కు బలవంతగా రా మేటిరీయల్ కేటాయించకుండా దారుణంగా వ్యవ హారిస్తుందని,గనులు ,అవసరమైన సామగ్రి ఇవ్వడం లేదని,పార్లమెంట్ లో గళం ఎత్తుతున్న స్పదించడం లేదని అన్నారు.పార్లమెంట్ 32 మంది ఎంపీ లు ఉన్న మౌనం గా వున్నారని,రోజుకి 5 కోట్లు వడ్డీ కట్టించుకుంటున్నారని చెప్పారు.వేల సంఖ్యలో ఉద్యోగుల ఆందోళన చేస్తున్న కేంద్రం వెనక్కు తగ్గ డం లేదని,కేంద్రం వైఖరి మార్చుకునే వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# ఇంటికే భద్రాద్రి తలంబ్రాలు

**హైదరాబాద్:**

గత కొంతకాలంగా వినూత్న నిర్ణయాలతో ఆర్టీసీని బలోపేతం చేసే దిశగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అడుగులు వేస్తోంది. ఓ వైపు ప్రస్తుతం ఉన్న భారాన్ని తగ్గించుకోవటంతో పాటు... ప్రయాణికులను ఆకర్షించేలా మార్పులు తీసుకువస్తోంది. ఇప్పటికే పలు ఆఫర్లను ప్రకటించగా... తాజాగా శ్రీరామనవమి సందర్భంగా భక్తులకు గుడ్ న్యూస్ చెప్పిందిశ్రీ రామనవమి వేడుకలు భద్రాచలం రాములోరి సన్నిధిలో వైభవంగా నిర్వహిస్తారు. ఈ వేడుకను చూసేందుకు భక్తులు భారీగా తరలివస్తుంటారు. అయితే కల్యాణంలో ఉపయోగించే తలంబ్రాలను భక్తులకు అందజేయాలని తెలంగాణ ఆర్టీసీ నిర్ణయించింది. గతేడాది మాదిరిగానే ఈ సారి కూడా తెలంగాణ దేవాదాయ శాఖ సహకారంతో రాములోరి కల్యాణ తలంబ్రాలను భక్తుల ఇళ్లకు చేరవేసేందుకు సిద్ధమైంది. తలంబ్రాలు కోరుకునే భక్తులు ఆర్టీసీ కార్గో పార్శిల్ కేంద్రాల్లో రూ.116 చెల్లించి వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుం దని ఆర్టీసీ అధికారులు ప్రకటించారు.ఈ సందర్భ ంగా హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో బుధవారం భద్రాద్రి శ్రీ సీతారాముల కల్యాణ తలంబ్రాల బుకింగ్ పోస్టర్‌ను టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జానర్ ఆవిష్కరించారు. అనంతరం బిజినెస్ హెడ్ పి.సంతోష్ కుమార్ రూ.116 చెల్లించి రశీదును స్వీకరించారు. తొలి బుకింగ్ చేసుకుని తలంబ్రాల బుకింగ్‌ను ప్రారంభించారు. ఇక గతేడాది దాదాపు 89 వేల మంది భక్తులకు తలంబ్రాలను అందజేసింది తెలంగాణ ఆర్టీసీ. తద్వారా రూ.71 లక్షల రాబడి వచ్చింది. ఈ ఏడాది కూడా భారీగా ఆదాయాన్ని పొందేందుకు సిద్ధమైంది.

# అప్పుల తెలంగాణాగా మార్చారు

### కాంగ్రెస్ నేత భట్టి విక్రమార్క

**హైదరాబాద్:**

హాత్ సే హాత్ జోడో పాదయాత్రకు బయలుదేరే ముందు కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ నేత భట్టి విక్రమార్క హైదరాబాద్లని తన ఇంట్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత అయన మీడియాతో మాట్లాడారు. టీఎస్ పిఎస్సీలో జరిగిన ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై నైతిక బాధ్యత వహిస్తూ సంబంధిత మంత్రి తక్షణమే రాజీనామా చేయాలి. ప్రభుత్వ బాధ్యత రాహిత్యం వల్లనే పేపర్ లీకేజీ జరిగినట్టు స్పష్టం అవుతున్నది. పేపర్ లీకేజీ కావడం వల్ల నిరుద్యోగులను చూస్తుంటే నాకు ఆవేదన కలుగుతున్నది. అవకతవకలు జరిగితే మంత్రులు రాజీనామా చేయాలన్న భయం ఉంటే రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులు ఉండవని అన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీ తో విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతున్నది. పేపర్ లీకేజీ వ్యవహారం పై సమగ్ర దర్యాప్తు జరపాలి. ఎంతటి పెద్దవారు ఉన్న బాధ్యులపై కఠినంగా చర్యలు తీసుకోవాలి. ప్రజల ఆకాంక్షలు, లక్ష్యాలు, ఆశలు నెరవేరాలని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇచ్చింది. దశాబ్ద బిఆర్ఎస్ పరిపాలనలో తెలంగాణ ప్రజల లక్ష్యాలు ఏ ఒక్కటి నెరవేరలేదు. తెలంగాణ వచ్చిన తర్వాత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 18 లక్షల కోట్ల బడ్జెట్ సంపద దుర్వినియోగం అయింది. రాష్ట్రంలో ఐదు లక్షల కోట్లు అప్పులు చేసిఅప్పుల తెలంగాణగా మార్చిన బిఆర్ఎస్ సర్కారని అన్నారు.

సాగునీటి ప్రాజెక్టులకు లక్షల కోట్లు ఖర్చు చేశామని చెప్పుకుంటున్న బిఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా ఏ ఒక్క ఎకరానికి నీరు ఇవ్వలేదు. గత కాంగ్రెస్ హయాంలో కట్టిన ప్రాజెక్టులకు కాలేశ్వరం పేరు పెట్టి ఆ ప్రాజెక్టు కట్టామని అంటే ఎట్లా? బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఎత్తిపోతల ప్రాజెక్టుల నుంచి ఒక ఎకరానికి నీళ్లు ఇవ్వలేదు. పాలమూరు రంగారెడ్డి పనులు దశాబ్ద కాలంగా సాగుతూనే ఉన్నాయని అన్నారు. తెలంగాణ ప్రజలు ఆశించిన ఆత్మగౌరవం దక్కడం లేదు. ప్రశ్నించడం పాపం అన్నట్టుగా ప్రశ్నించిన వారిని అరెస్టులు చేయడం, అక్రమ కేసులు పెట్టడం, జైల్లో నిర్బంధించి ప్రజల ఆత్మగౌరవాన్ని కాలరాస్తున్న బిఆర్ఎస్ ప్రభుత్వం. నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మ గౌరవం కోసం తెచ్చుకున్న తెలంగాణ లక్ష్యాలు నెరవేరకపోవడంతో నిరాశ నిస్పృహల్లో ప్రజలు ఉన్నారు. నిరాశ నిస్పృహల్లో ఉన్న ప్రజలకు అధైర్య పడొద్దని తొమ్మిది నెలల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో వస్తుందన్న ధైర్యం కల్పించడం కోసమే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే తెలంగాణ ప్రజల ఆశలు ఆకాంక్షల లక్ష్యాలు నెరవేరడం సాధ్యమని అన్నారు.

# రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసిన మహనీయుడు

**జగ్గయ్యపేట**

జగ్గయ్యపేట పట్టణంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు గారి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జగ్గయ్యపేట పట్టణంలో జమ్మి చెట్టు సెంటర్ నందుగల అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి తెదేపా శ్రేణులతో కలిసి జగ్గయ్యపేట మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు విగ్రహానికి పూలమానులు వేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల పితామహుడు, ఆంధ్ర రాష్ట్ర అవతారణ కొరకు ఆమరణ నిరాహార దీక్ష చేసిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అన్నారు.

ఈ కార్యక్రమంలో నూకల కుమార్ రాజా, గట్టిడి దుర్గాప్రసాద్,మేక వెంకటేశ్వర్లు,



మైనేని రాధాకృష్ణ, గింజుపల్లి రమేష్, కానూరి కిషోర్, కర్రి చిన్న వార్డు కౌన్సిలర్లు పేరం సైదేశ్వరరావు, సంగెపు బుజ్జిబాబు, గొట్టే నాగరాజు, ఇర్రి నరసింహారావు, నూకల బాలకృష్ణ, నాయకులు బేతు ప్రభాకర్, పున్నా ఉపేంద్ర, గుంజ నరసయ్య, షేక్ ఇంతియాజ్, కొప్పు సుధాకర్, మద్దుల ఉమా మహేశ్వర రావు, రాయపూడి శ్రీకాంత్, కర్లపాటి కొండ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు

# ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లుల మంజూరు చేయాలి

**కరీంనగర్**

గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రంలో ఉపాధ్యాయుల వేతనాలు నిబంధనల మేరకు ఒకటవ తేదీన చెల్లించాలని, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలనీ చేస్తున్న విజ్ఞప్తులన్నీ నిర్లక్ష్యానికి గురౌతున్నాయి. మిగులు బడ్జెట్ రాష్ట్రంలో గ్రాన్ఫన్ కింద చెల్లించబడుతున్నా జీతాలు అందరికీ ఒకటో తేదీన చెల్లించడానికి బదులుగా ఒక్కో జిల్లాకు ఒక్కో తేదీన పదిహేడో తేదీ వరకు చెల్లిస్తూ వస్తున్నారు. దీని వల్ల ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారనీ టీ పి టీ ఫ్ జిల్లా అధ్యక్షులు పోరెడ్డి దామోదర్ రెడ్డి , ప్రధాన కార్యదర్శి అర్ చంద్ర శేఖర్ లుఒక ప్రకటన లో తెలిపారు, బ్యాంక్ లోన్లు సకాలంలో చెల్లించలేక పెనాల్టీలు, అధిక వడ్డీలు కడుతున్నారు.జీపీఎఫ్ లోన్లు, పార్ట్ ఫైనల్లు చెల్లించబడక నెలల తరబడి ఎదురు చూపులు తప్పడం లేదు. లోన్ శాంక్షన్ కావడానికి కనీసం ఐదు నుంచి పది నెలల టైమ్ పడుతోంది. కొంతమందికి ఏడాది దాటినా కూడా అకౌంట్లలో డబ్బులు జమ కావడం " లేదు.. మరికొందరికి లోన్లు మంజూరైనట్టు చూపిస్తుండగా డబ్బులు చేతికి అందక ఇబ్బందులు పడుతున్నారు. జిపిఎఫ్ మంజూరీ చేయబడిన వెంటనే అభ్యర్థుల ఖాతాల నుండి తగ్గిస్తున్నారు. సంబంధితుల బ్యాంక్ ఖాతాలలో జమచేయడానికి పట్టే (సుమారు 8 నుండి 10 నెలల) కాలానికి వడ్డి నష్ట పోవాల్సి వస్తున్నది.జీపీఎఫ్ లోన్లు పార్ట్ ఫైనల్ మాత్రమే కాకుండా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన అన్ని రకాల బిల్లులను ఆర్థిక సంవత్సరం ముగిసేలోపే క్లియర్ చేయాల్సి ఉంటుంది. మెడికల్ రీయింబర్స్ మెంట్, సరెండర్ లీవులు, సప్లమెంటరీ బిల్లులు ఏవీ శాంక్షన్ కావడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో కొన్ని వేల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెండింగ్ బిల్లుల విడుదల కోసం రోజూ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. కొందరైతే ఏకంగా సెక్రటేరియట్ దాకా వస్తున్నారు. దీనివల్ల బిల్లుల చెల్లింపులో క్రమ పద్ధతి ఉండడం లేదు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం గడువు మార్చి 31 లోపు చెల్లింపులు కానిపక్షంలో ఈ బిల్లులన్నీ చెల్లకుండా పోతాయి. ఉద్యోగ ఉపాధ్యాయులు మళ్లీ కొత్త ఆర్థిక సంవత్సరంలో గత యేడాది లాగానే బిల్లులను రివాలిడేట్ చేయించు కోవాల్సి ఉంటుంది, లేదా అవే బిల్లులను కొత్తగా రీసబ్మిట్ చేయాల్సి ఉంటుంది. మరో 15 రోజుల్లో 2022-23 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నప్పటికీ పెండింగ్లో ఉన్న వివిధ రకాల బిల్లులు ఉపాధ్యాయుల అకౌంట్లలో జమ కాక ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితులలో పెండింగులో ఉన్న అన్ని రకాల బిల్లులకు వెంటనే నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ నెల 24 న సాయంత్రం 4 గం.కు జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ఉపాధ్యాయులతో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించబడును.

## నీటి కష్టాలు తీరేది ఎన్నడో...



**పత్తికొండ**

తుగ్గలి మండలం రాతన గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటు న్నారు. గత పది రోజుల నుండి అధికారులు, సర్పంచ్ దృష్టి కీ తీసుకెళ్లినా పైప్ లైన్ మరమ్మతులు చేయకపోవడం పై గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో దాదాపు రెండువేలు కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పూర్తి చేయడం కోసం గ్రామ సచివాలయం ఏర్పాటు చేసిన ఫలితం లేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ సిబ్బందికి పదేపదే చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు. త్రాగు నీటి కోసం గ్రామ సమీపంలోని చెరువు దగ్గరకు ఉన్న బోర్ వెళ్లి ఎడ్ల బండ్లు కట్టుకొని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి త్రాగునీటి సమస్య పరిష్కారం చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నా. అధికారులు స్పందించడం లేదు గ్రామ ప్రజలు మా గ్రామంలో తాగునీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదు. గత పది రోజుల నుండి త్రాగు నీటి కోసం ఇబ్బంది పడుతున్నాము. రోజు చెరువు దగ్గర లోని బోరు వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవడం కష్టంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలి. అని గ్రామ ప్రజలు కోరుతున్నారు

## వీధి కుక్కలను, కోతులను దూర ప్రాంతాలకు తరలించాలి



**బద్వేలు**

బద్వేల్ పట్టణం లోని వీధి కుక్కలను మరియు కోతులను జనవాసాలకు దూరంగా తరలించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని డిమాండ్ చేశారు. గురువారం ఉదయం స్థానిక బద్వేల్ మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ ...వైయస్సార్ కడప జిల్లా బద్వేల్ పట్టణం రోజురోజుకు విస్తరించి పట్టణం విశాలంగా అభివృద్ధి చెందుతున్న దశలో పట్టణ ప్రజలకు తీవ్రమైన అసౌకర్యానికి మరియు భయభ్రాంతులకు గురి చేస్తున్న వీధి కుక్కలు ప్రజలకు అవరోధంగా ఏర్పడ్డాయి. ఇటీవల కాలంలో వివిధ ప్రాంతాలలో వీధి కుక్కల దాడులలో చిన్నపిల్లలు వృద్ధులు తీవ్రంగా గాయపడి చనిపోయినటువంటి విషయం విధితమే ప్రస్తుతం మన బద్వేల్ పట్టణంలోని పలు వీధులలో వీధి కుక్కలు ఒక్కొక్కటిజతగా గుంపులుగా ఏర్పడి భయంకరమైన అరుపులతో ప్రజలు బితరిలేటట్లు అరుస్తూ మూకుమ్మడిగా మీద పడి దాడి చేస్తూ గాయపరుస్తున్నాయి. మీ దృష్టికి రాణి సమస్యలు కోకొల్లలు మీరు వీధులలో తిరిగి ప్రజలను విచారిస్తే విషయాలు బయటకు వస్తాయి. ఈ కారణంగా ఉదయం సాయంకాలం వేళల్లో విద్యార్థిని విద్యార్థులు మరియు వీధులలో ఆడుకునే చిన్న పిల్లలు భయాందోళనకు గురవుతున్నా.రు వీధి కుక్కలకు మేము తగ్గం అన్నట్లుగా కోతులు కూడా ప్రజలపై నిత్యవసరాల సరుకులపై అకస్మాత్తుగా దాడులు చేస్తూ స్వైర విహారం చేస్తున్నాయి. ప్రజలు బజారుకు వెళ్లి నిత్యావసర సరుకులు కూరగాయలు మార్కెట్లలో కొనుగోలు చేసుకుని ఇంటికి తెచ్చుకోవడం గగనంగా ఏర్పడింది. వెంటనే మీరు వీధులలో ఉన్న వీధి కుక్కలను మరియు కోతులను పట్టుకొని పట్టణ ప్రాంతానికి దూరంగా మరియు జనావాసాలకు దూరంగా వదిలిపెట్టాలని విజ్ఞప్తి చేస్తూ చిన్నపిల్లలను వృద్ధులను మరియు ముఖ్యంగా గుండె జబ్బులతో బాధపడుతున్న ప్రజలను తక్షణం వీటి బారి నుండి రక్షించి కాపాడాలని డివైఎఫ్ఐ యువజన సంఘం విజ్ఞప్తి చేస్తుంది. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ నాయకులు గంగనపల్లి నాగార్జున, ఎస్కే మస్తాన్ షరీఫ్ జీవి రమణారెడ్డి, రవికుమార్, ఇమ్మానేలు, ఎన్ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# పేపర్ లీక్..రంగంలోకి సిట్

## ఆందోళనలో 55 వేలమంది అభ్యర్థులు

**హైదరాబాద్:**

టీఎస్పీఎస్సీ లీకేజ్‌లో గందరగోళంగా తయారైంది పరిస్థితి. ఓవైపు విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు కమిషన్ కార్యాలయాన్ని ముట్టడించాయి. మరోవైపు సిట్ విచారణ వేగవంతం చేసింది. అయితే అభ్యర్థులు మాత్రం ఇంకా అయోమయంలోనే ఉన్నారు. లీక్ అయిన ఏఈ పరీక్షలను నిర్వహిస్తారా? తేదీ మారుస్తారా? టీఎస్పీఎస్సీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది సిట్ నివేదిక తర్వాతే తేలనుంది. అయితే ఏబీవీపీ కార్యకర్తలు మాత్రం టీఎస్పీఎస్సీ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లే ప్రయత్నాలు చేశారు. వారిని అరెస్ట్ చేసి స్టేషన్‌కి తరలించారు. ఇక వెస్ట్ జోన్ డీసీపీ ఏఆర్ శ్రీనివాస్ నేతృత్వంలో ప్రభుత్వం సిట్ వేసింది. దీంతో రంగంలోకి దిగిన సిట్.. టీఎస్పీఎస్సీలో దర్యాప్తు చేసింది. కమిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారుల నుంచి అన్నిరకాల వివరాలు సేకరించారు. కాన్ఫిడెన్షియల్ రూమ్‌లో పరిస్థితిని గమనించారు. హ్యాక్ అయిన కంప్యూటర్లు, వాటి ఐపీ అడ్రస్‌లు సేకరించారు. చైర్మన్, కార్యదర్శి కంప్యూటర్లనూ పరిశీలించారు సిట్ అధికారులు. పేషీల్లో పనిచేసే ఇతర సిబ్బందిని ప్రవీన్, రాజశేఖర్ కదలికల గురించి ఆరా తీశారు. దాదాపు రెండున్నర గంటల పాటు టీఎస్పీఎస్సీలో సోదాలు నిర్వహించిన సిట్ అధికారులు కీలక విషయాలు రాబట్టారు. కాన్ఫిడెన్షియల్ సెక్షన్ ఆఫీసర్ నుంచి యూజర్ ఐడీ, పాస్వర్డ్‌లను ప్రవీణ్ దొంగలించినట్లు గుర్తించారు. సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేస్తున్న రాజశేఖర్ సాయంతో పెన్ డ్రైవ్‌లో ప్రశ్నాపత్రాలు కాపీ చేసుకున్నాడు ప్రవీణ్. కాన్ఫిడెన్షియల్ సెక్షన్ ఆఫీసర్ గా పనిచేస్తున్న శంకర్ లక్ష్మి కంప్యూటర్ ను బాగు చేసే క్రమంలో రాజశేఖర్ ఐపీ అడ్రస్‌లు మార్చేశాడు. డైనమిక్ ఐపి అడ్రస్ కు బదులు స్టాటిక్ ఐపిని కంప్యూటర్‌కు అనుసంధానం చేశాడు రాజశేఖర్. దీంతో ఆ ఐపీ అడ్రస్‌తో సిస్టమ్‌ను హ్యాక్ చేసి.. ఏఈ సివిల్ పేపర్ ను కాపీ చేసుకున్నాడు ప్రవీణ్. ఇదంతా చేసింది రేణుక కోసమే అని తెలుస్తోంది. ఆ తర్వాత చాలా మందిని ట్రాప్ లో పడేసినట్లు సమాచారం. చాలా మంది మహిళలతో ప్రవీణ్ కాంటాక్ట్స్ ఉన్నట్లు తెలుస్తోంది. వారితో వీడియో కాల్స్ మాట్లాడినట్లు తెలుస్తోంది. దీంతో ప్రవీణ్ రాసలీలలపై కూడా అధికారులు కన్నేశారు. సెల్ ఫోన్ డేటా ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు. సిట్ నివేదిక రాకపోవడంతో పరీక్షను రద్దుచేయాలా లేదా అనే విషయాన్ని తేల్చలేదు టీఎస్పీఎస్సీ. ఇప్పటికే పేపర్ లీక్ అయిందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. కాని లిఖితపూర్వకంగా సిట్ నివేదిక ఇస్తే.. ఆతర్వాత తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామంటోంది ఝాఖూఅ. దీంతో 55వేల మంది అభ్యర్థులు ఆందోళనలో ఉన్నారు.

కొంతకాలం క్రితం కాన్ఫిడెన్షియల్ సెక్షన్ ఆఫీసర్ కంప్యూటర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో అక్కడ ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ రాజశేఖర్ రిపేర్ చేశాడు. ఆ సమయంలో డైనమిక్ ఐపీ అడ్రస్‌కు బదులు తనకు అనుకూలంగా స్టాటిక్ ఐపీని ఆ కంప్యూటర్‌కు అమర్చాడు. అనంతరం రాజశేఖర్ సాయంతోనే ప్రవీణ్ ప్రశ్నపత్రాలను పెన్ డ్రైవ్‌లోకి కాపీ చేయించుకున్నాడు. ప్రశ్నాపత్రాలను తొలుత రేణుక, ఆమె భర్తకు రూ.10లక్షలకు ప్రవీణ్ విక్రయించాడు. రేణుక ఇచ్చిన రూ.10లక్షలు ఎస్‌బీఐ ఖాతాలో జమ అయ్యాయి. ఆ తర్వాత రాజమహేంద్రవరంలో ఉన్న తన బాబాయ్ అకౌంట్‌కు రూ.3.5లక్షలు ట్రాన్స్ఫర్ చేసినట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో ఏఈ ప్రశ్నపత్రంతో పాటు టౌన్ ప్లానింగ్, వెటర్నరీ అసిస్టెంట్ ప్రశ్నపత్రాల లీకేజీ గురించి కూడా సిట్ అధికారులు ఆరా తీస్తున్నారు. దీనికి సంబంధించిన ప్రాథమిక నివేదికను సిట్ అధికారులు కమిషన్‌కు సమర్పించారు

## ఆమరణ దీక్షకు దిగుతాం

టీఎస్‌పీఎస్‌సీ క్వశ్చన్ పేపర్ లీకేజీ వ్యవహారం తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తోంది. లీకేజ్ కేసును టేకప్ చేసిన సిట్.. అన్ని కోణాల్లో ఆరాతీస్తోంది. పది రోజుల్లోనే కేసును ఓ కొలిక్కి తెస్తామని సిట్ చీఫ్ ఏఆర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రవీణ్, రేణుక వ్యవహారం.. ఏయే ప్రశ్నాపత్రాలను లీక్ చేశారు.. అనే విషయాలపై విచారణ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఝాఖ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. 48 గంటల్లో టీఎస్పీఎస్సీ గ్రూప్1 పరీక్షను రద్దు చేయకపోతే హైదరాబాద్ నడిబొడ్డున ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. టిఎస్‌పీఎస్‌సీ బోర్డుని రద్దు చేసి, తిరిగి కొత్తగా నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్‌సీ ఛైర్మన్ జనార్దన్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. టీఎస్‌పీఎస్‌సీ పేపర్‌లీక్‌కి పాల్పడి వేలాది మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడారని మండిపడ్డారు. చైర్మన్ దగ్గర ఉండాల్సిన పాస్వర్డ్ సెక్రెటరీ దగ్గరికి ఎలా వెళ్ళిందని ఆయన ప్రశ్నించారు. దీని వెనుక పెద్ద పెద్ద మనుషులే ఉన్నారని ఝాఖ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ ఆరోపించారు.ఝాఖూఅ దగ్గర హైటెన్షన్ నెలకొంది. పలు పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాలు దశలవారీగా ధర్నాలకు దిగాయి. టీఎస్‌పీఎస్సీ కార్యాలయం ముట్టడికి ప్రయత్నించింది ఏబీవీపీ. లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ క్రమంలో బారికేడ్లను దాటుకుని ముందుకెళ్లే ప్రయత్నంలో పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. అనంతరం పీఎస్‌కు తరలించారు. లీకేజీలపై సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపిచాంచాలని డిమాండ్ చేశారు ఏబీవీపీ నేతలుజమొత్తానికి లీకేజ్ ఎపిసోడ్ తెలంగాణను కుదిపేస్తోంది

# న్యూ స్ట్రాటజీలో కాంగీరేసు

**అదిలాబాద్:**

పార్టీ పటిష్ఠంగా ఉండాలంటే అన్ని గ్రూపులు అవసరమని కాంగ్రెస్ భావిస్తున్నది. అందుకే టీపీసీసీ చీఫ్ రేవంత్‌తో విభేదిస్తున్న సీనియర్లను బుజ్జగించడంతోపాటు అసంతృప్తి లేకుండా ఆలోచిస్తున్నది. రేవంత్ పాదయాత్ర చేస్తుండడంతో కేవలం ఒక్క వ్యక్తిమీదనే ఆధారపడటం సమంజసం కాదన్న భావనతో సీనియర్లు కూడా ఇలాంటి యాత్రలను చేసేలా ప్రోత్సహించింది. అందులో భాగంగానే గతంలో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేపట్టిన యాత్రలో స్వయంగా రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు థాక్రే పాల్గొన్నారు. తాజాగా సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క యాత్రకు కూడా ఏఐసీసీ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్ చార్జి మాణిక్‌రావ్ థాక్రే రాష్ట్ర యూనిట్‌లోని గ్రూపు తగాదాలను అధ్యయనం చేసి రెండు వర్గాలతో చర్చలు జరిపిన అనంతరం ఏఐసీసీకి నివేదిక ఇచ్చారు. దానికి అనుగుణంగానే రేవంత్ సహా సీనియర్లను కూడా కాపాడుకోవడం, సమాన ప్రాధాన్యత ఇవ్వడం, అందరినీ కలుపుకుపోయే వాతావరణాన్ని సృష్టించాలని ఏఐసీసీ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. వ్యక్తి కేంద్రంగా పార్టీ నడవడం ఆరోగ్యకరం కాదన్న ఉద్దేశంతోనే ఏఐసీసీ అందరినీ కలుపుకుపోవాలని చూస్తున్నది. టీపీసీసీ చీఫ్‌తో ఏర్పడిన విభేదాలతో సీనియర్లందరినీ దూరం చేసుకోవడం సాధ్యం కాదనే అభిప్రాయానికి వచ్చింది. అందుకే రేవంత్ రెడ్డికి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నదో, సీనియర్లకు కూడా అదే తరహా ప్రయారిటీ ఇచ్చి వారిలో ఏర్పడిన అసంతృప్తిని దూరం చేయాలని భావిస్తున్నది. ఒక వ్యక్తి ఏదేని కారణాలతో పార్టీ నుంచి దూరమైనా, అది పార్టీపై ఎక్కువ ప్రభావం చూపకుండా ఉండాలని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నది. పాదయాత్రల సందర్భంగా సన్నిహితంగా ఉండే వ్యక్తులను అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించుకుని ఒక బలమైన వర్గంగా మారి పార్టీని సవాలు చేసే స్థితిలో ఉండకుండా సీనియర్లను, పీసీసీ చీఫ్‌నూ బ్యాలెన్సుగా నడిపించేలా హైకమాండ్ అడుగులు వేస్తున్నది. అయితే భవిష్యత్తులో మరికొద్దిమంది సీనియర్లు కూడా పాదయాత్రల ప్రతిపాదన తెస్తే ఎలా ఆలోచిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ఒకరి కోసం మరొకరిని చేజార్చుకోవడం ఏఐసీసీకి ఇష్టం లేదు. వ్యక్తి కేంద్రంగా పార్టీ నడిస్తే ఏదో ఒకరోజు అనూహ్య పరిణామం జరిగితే అది పార్టీకి చేటు తెస్తుందన్న పాత అనుభవాలతో తెలంగాణలో ఆచితూచి అడుగేస్తున్నది. రేవంత్ ఒక మాస్ లీడర్‌గా, వాగ్ధాటి కలిగిన వ్యక్తిగా, అధికార బీఆర్ఎస్‌ను ఢీకొట్టే పీసీసీ చీఫ్‌గా, ప్రభుత్వ వైఫల్యాలను సూటిగా ప్రజల్లోకి తీసుకెళ్లే స్పీకర్‌గా ఏఐసీసీ స్పష్టమైన అభిప్రాయంతో ఉన్నది. కానీ ఒక టీమ్‌గా పీసీసీని నడిపించడంలో రేవంత్ తన వంతు ప్రయత్నాలు చేసినా గ్రూపుల ఘర్షణలను, వర్గాల పోరును నివారించడంలో ఆశించిన ఫలితాలను సాధించలేదనే వాస్తవాన్నీ ఏఐసీసీ గుర్తించింది. రేవంత్ ను సంతృప్తిపర్చాలనుకుంటే దాదాపు పది మంది సీనియర్లు అంటీ ముట్టనట్లుగా మిగిలిపోయే ప్రమాదమున్నదని, అంచనాలు తప్పి పార్టీని వీడే అవకాశమూ లేకపోలేదని ఏఐసీసీ గ్రహించింది. రేవంత్ పాదయాత్ర ద్వారా ప్రజలకు చేరువైతే అది పార్టీకే ప్రయోజనమని, అయితే అదే సమయంలో వ్యక్తి గొప్పదనంగా ప్రజల్లోకి మెసేజ్ వెళ్లడం పార్టీకి చేటు తెస్తుందనే కోణం నుంచి కూడా ఆలోచించింది. పార్టీ తరఫున ఎంతమంది సీనియర్లు పాదయాత్ర చేసినా ప్రజల్లో పార్టీ బలపడుతుందనే అంచనా ఏర్పడితే వాటికి సానుకూలంగా స్పందించడమే బెటర్ అనే అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. భట్టి విక్రమార్క ఈ నెల 16 నుంచి ప్రారంభించే పాదయాత్రకు కొద్దిమంది సీనియర్ నేతలను కూడా పంపేలా ఆలోచిస్తున్నట్లు తెలిసింది. భట్టి విక్రమార్క ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్ సెగ్మెంట్ నుంచి పాదయాత్ర ప్రారంభించనున్నారు. 91 రోజుల పాటు మొత్తం 39 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా సుమారు 1,365 కి.మీ మేర ఈ యాత్ర సాగనున్నది. ఉమ్మడి జిల్లాలైన ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ మీదుగా సాగి చివరకు ఖమ్మం జిల్లా కేంద్రంలో ముగియనున్నది. ఈ రూట్ మ్యాప్‌లో రేవంత్‌తో విభేదిస్తున్న పలువురు సీనియర్ నాయకులకు చెందిన అసెంబ్లీ సెగ్మెంట్లు కూడా ఉన్నాయి. వారు భట్టి విక్రమార్కతో సన్నిహిత సంబంధాలు ఉన్నందున రేవంత్ పాదయాత్రకంటే ఇదే సక్సెస్ అయిందనే మెసేజ్‌ను అటు ప్రజల్లోకి, ఇటు ఏఐసీసీ దృష్టిలోకి వెళ్లేలా ఆలోచిస్తున్నారు.

# కేటీఆర్ కు పూర్తి స్థాయి బాధ్యతలు..?

**హైదరాబాద్:**

టీఆర్ఎస్ బీఆర్ఎస్ గా పేరు మార్చుకున్న తర్వాత, ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలనే కాదు పరిపాలన వ్యవహారాలను కూడా పెద్దగా పట్టించుకోవడం లేదని అటు పార్టీ ముఖ్యులు, ఇటు అధికార వర్గాలలో చర్చ జరుగుతోంది. అందుకే, ముఖ్యమంత్రి వద్ద పెండింగ్ ఫైల్స్ కొండలా పెరిగిపోతున్నాయని అధికారులు ప్రైవేటు సంభాషణల్లో చెపుతున్నారని అంటున్నారు. అలాగే, ముఖ్యమంత్రి కేసీఆర్ పార్టీ ప్రభుత్వ బాధ్యతలు పూర్తిగా మంత్రి కేటీఆర్ కు అప్పగించి, ఆయన తెర వెనక సలహాదారు పాత్రకు పరిమితం అయ్యారని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. నిజానికి ముఖ్యమంత్రి కేసీఆర్ జాతీయ రాజకీయాలపై చర్చించే సమయంలో ఒకానొక సందర్భంలో సరదాగానే కావచ్చును రాష్ట్ర రాజకీయాలపై తనకు ఆసక్తి తగ్గిపోతోందని (బోర్ కొడుతోందని) మీడియా సమావేశంలో అన్నారు. అలాగే 2018లో రెండవ సారి అధికారంలోకి వచ్చింది మొదలు పార్టీ ప్రభుత్వ పగ్గాలు వారసుడు మంత్రి కేటీఆర్ కు అప్పగించే ప్రయత్నాలు సాగుతూనే ఉన్నాయి. అనేక సందర్భాలలో మంత్రులు ఇతర ముఖ్య నేతలు కేటీఆర్ ను కాబోయే ముఖ్యమంత్రిగా సంభోదించడమే కాకుండా ముఖ్యమంత్రితో సమాన గౌరవాన్ని ఇవ్వడం కూడా మీడియా దృష్టికి వస్తూనే వుంది. మీడియా



చూపుతూనే వుంది. అయితే కారాణాలు ఏవైనా కేటీఆర్ పట్టాభిషేకం ముహూర్తం వాయిదాపడుతూ వచ్చింది. వస్తోంది. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ జాతీయ రాజకీయ ఎజెండా తెరపైకి తెచ్చి రాష్ట్ర రాజకీయ, ప్రభుత్వ బాధ్యతల కేటీఆర్ కు అప్పగించి, తాను మెల్లమెల్లగా తెర వెనక్కి తప్పుకుంటున్నారని అంటున్నారు. ఇటీవల చోటు చేసుకున్న రెండు కీలక పరిణామాలను అందుకు ఉదాహరణగా చూపుతున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాం లో చిక్కుకున్న కవితను ఈడీ విచారించిన సమయంలో మాములుగా అయితే ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా ఢిల్లీ వెళ్లి చక్రం తిప్పుతారని అందరూ అనుకున్నారు. కానీ ముఖ్యమంత్రి ఆ బాధ్యతను కేటీఆర్ కు అప్పగించారు. కేటీఆర్ ను ఢిల్లీ పంపిచారు. అఫ్కోర్స్ ఆయన వెంట మాజీ ట్రబుల్ షూటర్ మంత్రి హరీష్ రావుతో పాటుగా మరి కొందరు మంత్రులను కూడా ఆయన వెంట పంపినా మెయిన్ టాస్క్ మాత్రం కేటీఆర్ చేతుల మీదగానే కానిచ్చారు. అందుకే ఫైనల్ గా, ఢిల్లీలో చక్రం తిప్పిన కేటీఆర్ అంటూ మీడియాలో ప్రచారం జరిగింది. న్నికలకు పార్టీని సిద్ధం చేసే బాధ్యతను కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ కుమారుడు కేటీఆర్ కు అప్పగించారని అంటున్నారు. ఢిల్లీ ఎపిసోడ్ తర్వాత కేటీఆర్ పార్టీ మీద దృష్టి పెట్టారు. ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడి స్థాయిలో తీసుకోవలసిన కీలక నిర్ణయాలు అయన స్వయంగా తీసుకుంటున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులతో ప్రత్యేకంగా టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వచ్చే కొద్ది నెలల్లో విస్తృతంగా కార్యక్రమాల నిర్వహణకు షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ఎన్నికల్ రోడ్ మ్యాప్ ను సిద్దంచేశారు. ఇటీవల పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుకు కేటీఆర్ వివిధ స్థాయి నాయకులు కార్యకర్తలతో టెలీకాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నారు. అలాగే, వివిధ స్థాయిల్లో సమన్వయం పై దృష్టి సారించారు. పార్టీలో క్షేత్ర స్థాయి నుంచి పై స్థాయి వరకు సమన్వయం కొనసాగేలా కార్యక్రమాలను రూపొందించారు. అందులో భాగంగా తక్షణమే ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణకు శ్రీకారం చుట్టనున్నారు. అందు కోసం ప్రత్యేకంగా జిల్లాల వారీగా కొత్తగా ఇన్‌చార్జీలను నియమించారు. అలాగే జిల్లా కార్యాలయాల ఏర్పాటుకు షెడ్యులు ఖరారు చేశారు. ఈ పరిణామాలను గమనిస్తే కేసీఆర్ పార్టీ, ప్రభుత్వ పగ్గాలను వారసుడు కీటీఆర్ కు అప్పగించి తాను రాష్ట్ర రాజకీయాల నుంచి వీఆర్ఎస్ తీసుకునే దిశగా అడుగులు వేస్తున్న వైనం కనిపిస్తోందని అంటున్నారు.

# అంతర రాష్ట్ర చైన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్

**నందిగామ**

పలు ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్ లకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులనుంచి 580 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల ఎన్.టి.ఆర్ జిల్లా లో జరుగుతున్న దొంగతనాలు, యు చైన్ స్నాచింగ్ లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అనుమానితుల కదలికలపై పూర్తి నిఘా ఏర్పాటు చేసారు.

ఈ క్రమంలో నందిగామ సబ్ డివిజన్ పరిధిలో ఎక్కువ చైన్ స్నాచింగ్ లు జరుగుతున్నట్లు వచ్చిన పిర్యాదుల నేపథ్యంలో నందిగామ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీ కె.సతీష్, నందిగామ ఎస్.ఐ.లు పి.సురేష్, ఎం. పండుదొర గార్లు వారి సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలుగా



ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానంతో నందిగామ చుట్టుప్రక్కల ప్రాంతాలలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసారు.

బుధవారం సాయంత్రం వచ్చిన పక్కా సమాచారం మేరకు నందిగామ గ్రామ శివారులో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి సుమారు 34 లక్షల విలువైన 580 గ్రాముల బంగారు ఆభరణాలు (చోరీ సొత్తు)ను మరియు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసారు.

# లాటరీ పద్ధతిన డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపు

**పెద్దపల్లి**

జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ లాటరీ పద్ధతి ద్వారా పూర్తి పారదర్శకంగా చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక అమర్ చంద్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక డ్రా కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఆయన పాల్గొని లబ్ధిదారుల సమక్షంలో కేటగిరీ వారీగా డ్రా తీశారు. నిరుపేదల చిరకాల స్వప్నం సొంత ఇల్లు అని, ఇంటి కలను సాకారం చేస్తూ నిరుపేదల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణం పథకం చేపట్టిందని అన్నారు. నిలువ నీడ లేక బాధపడుతున్న వారి ముఖంలో చిరునవ్వులు చిందెలా డబుల్ బెడ్ రూం ఇల్లు ప్రభుత్వం నిర్మించి పూర్తి ఉచితంగా లబ్ధిదారులకు అందజేస్తుందన్నారు. పెద్దపల్లి పరిధిలో చందపల్లి, కూనారాం రోడ్డులో నిర్మించిన 484 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలకు లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి పారదర్శకంగా చేపట్టినట్లు తెలిపారు. దరఖాస్తులను పరిశీలన చేసి అర్హత మేరకు అర్హుల పేర్లతో కూడిన జాబితాను తయారు చేసి మార్చి 4 నుండి 13 వరకు అభ్యంతరాలను స్వీకరించి పూర్తి పారదర్శకంగా ఫైనల్ జాబితాను తయారు చేసినట్లు తెలిపారు. పెద్దపల్లి పరిధిలోని చందపల్లీ, కూనారం రోడ్డులో నిర్మించిన 484 ఇళ్లకు గానుమొత్తం 2079 దరఖాస్తులు రాగా, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి 1050 మంది అర్హులను ఎంపిక చేయడం జరిగిందని, మిగిలిన 1029 దరఖాస్తులను తిరస్కరించామని అన్నారు. జిల్లాలో ఎంపిక కాబడిన 1050 అర్హుల దరఖాస్తులకు గాను 484 డబుల్ బెడ్ రూం ఇండ్ల కేటాయింపులో ప్రభుత్వ ఆదేశాల మేరకు రిజర్వేషన్ పాటించడం జరిగిందని, ఎస్సీ దరఖాస్తుదారులకు 17%, మైనారిటీ దరఖాస్తుదారులకు 12%, ఎస్టీ దరఖాస్తుదారులకు 6% రిజర్వేషన్ ప్రకారం ఎంపిక చేసినట్లు, ప్రతి విభాగంలో దివ్యాంగులకు 5% రిజర్వేషన్ కల్పించినట్లు అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా 138 మంది అర్హులైన ఎస్సీ లబ్ధిదారులు గుర్తించామని, వీరిలో నుంచి లాటరీ పద్ధతి ద్వారా 81 మంది లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని, ఎస్టీ కోటా కింద 29 ఇండ్లు కేటాయించగా, 10 మంది అర్హులైన లబ్ధిదారులు మాత్రమే ఉన్నందున వంద శాతం ఎంపిక చేయడం జరిగిందని, మైనారిటీ కోటా 12% కింద ఎంపిక చేసిన 389 అర్హులైన దరఖాస్తుదారుల నుంచి లాటరీ పద్ధతి ద్వారా 55 మంది లబ్ధిదారులను ఎంపిక చేసామని ఆయన తెలిపారు. ఓపెన్ క్యాటగిరి కింద 321 మంది లబ్ధిదారులను లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేసినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రతి కేటగిరిలో దివ్యాంగులకు 5% రిజర్వేషన్ కల్పించామని, దీని ప్రకారం 24 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించడం జరిగిందన్నారు

# ఓర్పుకు సహనానికి మరో పేరు మహిళలే

## టి పి సి సి సభ్యులు నాగా సీతారాములు

**భద్రాద్రి కొత్తగూడెం:**

ఓర్పుకు సహనానికి మరో పేరు మహిళలే అని కొత్తగూడెం నియోజకవర్గ టిపిసిసి సభ్యులు నాగ సీతారాములు అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలోని చుంచుపల్లి మండలం ప్రగతి సమాఖ్య గ్రామ సమితి ఆధ్వర్యంలో మహిళదినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిధిగా హాజరైన టీపీసీసీ సభ్యులు మాట్లాడుతూ స్త్రీ అంటే ప్రకృతి వంటిదని తల్లిగా, భార్యగా, చెల్లె గా సామాజిక బాధ్యత గల పౌరురాలిగా అనేక బాధ్యతలు నిర్వహించేటువంటి లక్షణం కేవలం మహిళలకే సాధ్యమని, ఓర్పుకు సహనాలకి మరో పేరు మహిళలే అని అన్నారు. ఇన్ని బాధ్యతలు నిర్వర్తిస్తూ కుటుంబాన్ని కూడా ముందుకు తీసుకు వెళ్లడంతో ముందుంటున్నారని, ధర్మము అనేది స్త్రీల ద్వారానే కాపాడ బడుతుందని, మహిళలు కంటతడి పెట్టిన చోట సుఖం, శాంతి ఉండదని అన్నారు. చదువుకు పేదరికం, పెళ్లి అడ్డం కాదని, ఆధునిక కాలంలో ఎక్కువ సంఖ్యలో మహిళలు అన్ని రంగాల్లోకి వస్తున్నారని అన్ని రకాల ఉద్యోగాలలో మహిళలు ఎక్కువ అవకాశాలు పొందుతున్నారని మహిళలు ఏ పనిని చేపట్టిన సమర్థవంతంగా నిర్వహిస్తారని చెప్పుకొచ్చారు. మహిళలకు ఉన్న శక్తి చాలా విషయాల్లో పురుషులకు ఉండదని మహిళలకు ఎక్కువగా సపోర్ట్ చేస్తే అన్ని రంగాల్లో బాగా రాణిస్తారని చెప్పారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు ను సన్మానించారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ మడిపల్లి.శ్రీనివాసులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆది పినిశెట్టి, 'శబ్దం'లో కీలక పాత్రలో సిమ్రాన్

డాషింగ్ హీరో ఆది పినిశెట్టి మరో ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'వైశాలి' సూపర్ హిట్ తర్వాత దర్శకుడు అరివళగన్‌తో కలసి ఆది పినిశెట్టి చేస్తున్న చిత్రం 'శబ్దం'. 7ఉ ఫిల్మ్ శివ, ఆల్ఫా ఫ్రేమ్స్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మించనుండగా, ఎస్ బానుప్రియ శివ సహ నిర్మాత. ద్విభాషా చిత్రంగా తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపొందుతున్న ఈ చిత్రంలో కథానాయికగా లక్ష్మి మీనన్ నటిస్తోంది. తాజాగా ఈ చిత్రంలో ప్రముఖ సీనియర్ హీరోయిన్ సిమ్రాన్ కీలక పాత్ర పోషిస్తున్నారని మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ చిత్రం కోసం ప్రముఖ నటీనటులు, ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణుల పని చేస్తున్నారు. అరుణ్ బత్మనాభన్ కెమెరా మెన్ గా పని చేస్తుండగా, స్టార్ కంపోజర్ ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నారు. సాబు జోసెఫ్ ఎడిటర్ గా మనోజ్ కుమార్ ఆర్ట్ డైరెక్టర్ గా పని చేస్తున్నారు.




# నాగ చైతన్య,'కస్టడీ' టీజర్ విడుదల

అక్కినేని నాగ చైతన్య, వెంకట్ ప్రభు క్రేజీ కాంబినేషన్‌లో రూపొందుతున్న ప్రతిష్టాత్మక తెలుగు-తమిళ ద్విభాషా చిత్రం 'కస్టడీ' వేసవిలో ప్రధాన ఆకర్షణలలో ఒకటిగా విడుదలకు సిద్ధమవుతోంది. మరోవైపు ఈ చిత్రానికి సంబంధించిన ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా జరుగుతున్నాయి. టీజర్ టీజ్ తో క్యూరియాసిటీ క్రియేట్ చేసిన మేకర్స్ టీజర్‌తో వచ్చారు.నాగ చైతన్య వాయిస్‌ఓవర్‌తో టీజర్ ప్రారంభమవుతుంది. 'గాయపడిన మనసు ఆ మనిషిని ఎంత దూరం అయినా తీసుకెళుతుంది. అది ఇప్పుడు నన్ను తీసుకొచ్చింది ఓ యుద్ధానికి. ఇక్కడ నన్ను చావు వెంటాడుతుంది. అది ఎటు నుంచి వస్తుందో ఎప్పుడు , ఎలా వస్తుందో నాకు తెలీదు. తెలుసుకోవాలని కూడా లేదు. ఎందుకంటే నా చేతిలో వున్న ఆయుధం ఒక నిజం. నిజం ఒక ధైర్యం. నిజం ఒక సైన్యం. యస్.. దట్ ట్రూత్ ఈజ్ ఇన్ మై కస్టడీ" అనే వాయిస్ ఓవర్ చాలా ఆసక్తికరంగా వుంది. నాగ చైతన్య తన అద్భుతమైన పెర్ఫార్మెన్స్ తో అదరగొట్టాడు. కృతి శెట్టి అతని గర్ల్‌ఫ్రెండ్‌గా కూల్‌గా కనిపించింది. అరవింద్ స్వామి తన విలనీ యాక్టింగ్‌తో క్యారెక్టర్‌కి ఎక్స్‌ట్రా ఇంటెన్సిటీని తీసుకొచ్చాడు. శరత్‌కుమార్, ఇతర నటీనటులు తమ తమ పాత్రల్లో కన్విన్సింగ్‌గా కనిపించారు.ఎప్పుడూ కొత్తదనం వుండే కథలనే ఎంచుకునే జీనియస్ వెంకట్ ప్రభు మరో యూనిక్ కాన్సెప్ట్‌తో వచ్చారు. కథాంశం గురించి పెద్దగా వెల్లడించకుండా, టీజర్ చూపించిన విధానం క్యురియాసిటీని పెంచింది.ఎస్‌ఆర్ కతీర్ కెమెరా పనితనం అద్భుతంగా వుంది. మాస్ట్రో ఇళయరాజా, లిటిల్ మాస్ట్రో యువన్ శంకర్ రాజా



ద్వయం చేసిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ భావోద్వేగాలను, కథానాయకుడు అనుభవించే బాధను ఎలివేట్ చేయడానికి సహాయపడింది. అబ్బూరి రవి డైలాగ్స్ ప్రత్యేకంగా చెప్పుకోవాలి.శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నఈ చిత్రం అత్యున్నత నిర్మాణ విలువలు , సాంకేతిక ప్రమాణాలు టీజర్‌లో గమనించవచ్చు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ని పవన్‌కుమార్ సమర్పిస్తున్నారు. ఈ గ్రిప్పింగ్ టీజర్ తప్పకుండా బజ్‌ని మరింతగా పెంచుతోంది.ఈ చిత్రానికి రాజీవ్ ప్రొడక్షన్ డిజైనర్, డివై సత్యనారాయణ ఆర్ట్ డైరెక్టర్. కస్టడీ మే 12, 2023న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

తారాగణం: నాగ చైతన్య, కృతి శెట్టి, అరవింద్ స్వామి, ప్రియమణి, శరత్ కుమార్, సంపత్ రాజ్, ప్రేమి అమరేన్, వెన్నెల కిషోర్, ప్రేమి విశ్వనాథ్ తదితరులు









Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950